J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 18.12.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 5




లాయర్
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerpatrika.com

# తెలుగు సిఎంల ఢిల్లీ బాట



"తెలంగాణలో ఇక భవిష్యత్తంతా భారతీయ జనతా పార్టీదే. ఇక్కడ అధికారం చేజిక్కించుకుని సుపరిపాలనతో తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేది మేమే..."
- బండి సంజయ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు.

"ఆంధ్రాలో పాగావేస్తాం. భాజపా సారధ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి అమరావతినే రాజధానిగా కొనసాగిస్తాం. 5వేల కోట్లతో రాజధానిని అభివృద్ధి చేసి చూపిస్తాం..."
- సోము వీర్రాజు, ఆంధ్రా భాజపా సారథి.

అక్కడ తెలంగాణలోనూ, ఇక్కడ ఆంధ్రాలోనూ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు అధికార పార్టీలకు వ్యతిరేకంగా ఇస్తున్న ప్రకటనలు, ఇద్దరు (మిగతా 10వ పేజీలో)






## మన శాస్త్రవేత్తల మరో విజయం
### పిఎస్ఎల్వి-సి50 దిగ్విజయం

పిఎస్ఎల్వి సి-50 రాకెట్ ప్రయోగం దిగ్విజయమైంది. గగనతలంలో మరోసారి.. భారత్ విజయకేతనం ఎగరేసింది. అంతరిక్ష రంగంలో అపార ప్రతిభా పాటవాలతో నిర్విరామ కృషితో భారత శాస్త్రవేత్తలు అంతరిక్షంలో మరో అద్భుతాన్ని సాధించారు. శ్రీహరికోటలోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఈ రాకెట్ అనుకున్న సమయానికే నిర్దేశిత కక్షలో ప్రవేశపెట్టడం మన శాస్త్రవేత్తలు సాధించిన మరో అపూర్వ విజయం.
(వివరాలు 2వ పేజీలో)

## తమిళనాట...
# తలైవా మాట!



**త**మిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణంతో స్తబ్దుగా ఉన్న తమిళ రాజకీయ రంగంలో ఒక్కసారిగా సందడి మొదలయ్యింది. ఎప్పుడెప్పుడా అని తమిళ సోదరులు ఎదురు చూస్తుండిన రజనీకాంత్ రాజకీయ ఆరంగేట్రానికి ముహూర్తం ఖరారైపోయింది. 'మక్కల్ సేవై కట్చి'(ప్రజాసేవ పార్టీ) వేదికగా తలైవా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టబోతున్నాడు.

యంజిఆర్, కరుణానిధి, జయలలిత ముగ్గురూ సినీ దిగ్గజాలే. ముగ్గురూ రాజకీయాలలో చక్రం తిప్పి తమ మార్కు చూపించినవాళ్ళే. ముగ్గురూ ఇతర రాష్ట్రాలకు, ఇతర భాషలకూ చెందిన వారైనా తమిళ సోదరుల ఆశీస్సులు పొందినవారే. అందరూ ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు. ముందుగా యంజి రామచంద్రన్, ఆ తరువాత జయలలిత మరికొన్నాళ్ళకు కరుణానిధి. ఇలా ఒక్కొక్కరుగా తమిళ రాజకీయాలలో తమదైన తరహాలో బలమైన ముద్ర వేసుకుని తరలిపోయారు. జయలలిత మరణించక ముందే కరుణానిధి వయోభారంతో పాటు అనారోగ్యం పాలై రాజకీయాలకు దూరం కావడంతో జయలలిత తుది శ్వాస వరకు రాజకీయాలలో తన ఉనికిని చాటుకుంది. తమిళనాడు ముఖ్యమంత్రి హోదాలోనే ఆమె కన్ను మూసింది.

దక్షిణ భారతదేశంలో తమిళ నాడుకు ఒక ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా తమిళ రాజకీయాలకు అరుదైన గుర్తింపు ఉంది. తమిళ నాడులో ప్రాంతీయ పార్టీల ప్రభావమే ఎక్కువగా వుంటుంది. స్థానిక నినాదం ఇక్కడ బాగా వినిపిస్తుంది. అయితే ఒక విచిత్రం ఏమిటంటే తమిళనాట రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న కరుణానిధి మాతృభాష తెలుగు. యంజిఆర్ శ్రీలంకలో పుట్టిన మలయాళీ, ఇక జయలలిత తల్లి తెలుగు, తండ్రి కన్నడ ఇలా ఈ ముగ్గురు స్థానికులు కాదు. కానీ స్థానికంగా ప్రాచుర్యం పొంది ఆదరింపబడ్డారు. తమిళ సోదరుల గుండెల్లో దైవాలుగా నిలిచారు.

ఇప్పుడు రజనీకాంత్ కూడా తమిళ వాడుకాదు. కర్ణాటకలో జన్మించిన మరాఠి. (మిగతా 10వ పేజీలో)



# మన శాస్త్రవేత్తల మరో విజయం



## పిఎస్ఎల్వి సి-50 దిగ్విజయం



శ్రీహరికోటలోని సతీష్ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ఈనెల 17వతేది గురువారం మధ్యాహ్నం అనుకున్న సమయానికే సరిగ్గా 3గంటలా 41నిమిషాలకు పిఎస్ఎల్వి–సి50 రాకెట్ నింగిలోకి విజయవంతంగా దూసుకుపోయింది. నాలుగు దశల రాకెట్ ప్రయాణం 20 నిమిషాల 11 సెకన్లలో పూర్తయింది. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో ఛైర్మెన్ శివన్ హర్షం వ్యక్తం చేస్తూ శాస్త్రవేత్తలను అభినందించారు. ఈ శాటిలైట్ అత్యద్భుతంగా పనిచేస్తోందని, నాలుగు రోజుల్లో నిర్ణీత ప్రదేశంలోకి ప్రవేశపెడతామని ఆయన పేర్కొన్నారు.

భూమి మీద వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు, తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలను ముందుగానే కనుగొని వాటి బారినుంచి వీలైనంత రక్షణ పొందడానికి అవసరమైన సమాచారాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తాజాగా రూపొందించిన పిఎస్ఎల్వి–సి50 రాకెట్ అంతరిక్షంలోకి అనుకున్న లక్ష్యం మేరకు రివ్వుమంటూ దూసుకుపోయింది. భారత్కు అపూర్వ విజయం సాధించిపెట్టింది. దాదాపు ఏడేళ్ళపాటు ఖచ్చితమైన సమాచారం అందించేలా అత్యద్భుతమైన రీతిలో రూపొందించిన ఈ రాకెట్ అద్భుత విజయం సాధించడం భారత్ శాస్త్రవేత్తల విశేష ప్రతిభకు నిదర్శనం. దీంతో ఎంతో క్లిష్టమైన అంతరిక్ష శాస్త్ర పరిశోధనల్లో భారత్ మరో మైలురాయిని అధిగమించినట్లయింది. షార్లోని రెండవ ప్రయోగ వేదికపై నుంచి ఈ రాకెట్ను ప్రయోగించారు. ఈ రాకెట్తో పాటు అనుసంధానించిన ఈ సమాచార ఉపగ్రహం భారత్కు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది.

### ఎంతో నమ్మకమైన పిఎస్ఎల్వి రాకెట్లు

ఇప్పటివరకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎంతో నమ్మకమైన పిఎస్ఎల్వి స్టార్ రాకెట్ల ద్వారా ఎన్నో ఘనవిజయాలను సొంతం చేసుకుంది. ఎంతో ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్, మంగళయాన్ వంటి గ్రహాంతర ప్రయోగాలను కూడా చేపట్టి అంతరిక్ష పరిజ్ఞానంలో తన సత్తా చాటుకుంటోంది. ఇప్పటిదాకా రాకెట్ ప్రయోగాల ద్వారా ఒకేసారి 10 ఉపగ్రహాలు, 20 ఉపగ్రహాలు, ఆ తర్వాత 104 దేశీయ ఉపగ్రహాలను సైతం అలవోకగా తీసుకువెళ్ళి అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలిగిన సత్తా పిఎస్ఎల్వికే సొంతం. ఇప్పటివరకు 51 పిఎస్ఎల్వి రాకెట్లను ప్రయోగించగా అందులో రెండు మాత్రమే విఫలమయ్యాయి. తాజా ప్రయోగంతో పిఎస్ఎల్వి సీరీస్ రాకెట్ల ప్రయోగంలో మనదేశం మరో ముందడుగు వేసినట్లైంది. ఇప్పటిదాకా ఇస్రో 32 దేశాలకు చెందిన 234 ఉపగ్రహాలను, మరో 10 స్టూడెంట్ శాటిలైట్లను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రవేశపెట్టి తన ప్రతిభాపాటవాలను నిరూపించుకుంది. గురువారం చేపట్టిన పిఎస్ఎల్వి –సి50 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో భారత కీర్తి పతాక వినువీధిలో రెపరెపలాడింది. ఈ ప్రయోగం ద్వారా 1410 కిలోల బరువున్న సిఎంఎస్ 01 (జీశాట్ 12 ఆర్) అనే కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని రోదసిలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం విశేషం. అంతరిక్ష ప్రయోగాల్లో భారత శాస్త్రవేత్తలు అగ్రదేశాలకు ధీటుగా ప్రయోగాలు నిర్వహిస్తూ గగన తలంలో భారత కీర్తిపతాకను రెపరెపలాడిస్తున్నారు.పిఎస్ఎల్వి సి–50 రాకెట్ను శాస్త్రవేత్తలు ఎక్స్ఎల్ తరహాలో రూపొందించి, ఈ ఆకృతిలో ఆరు స్ట్రాపాన్లు అమర్చారు. ఇప్పటిదాకా షార్ నుంచి చేసిన రాకెట్ ప్రయోగాల్లో ఇది 77వది. పిఎస్ఎల్వి సీరీస్లో 52వది.

### ఈ ఏడాదిలో రెండో రాకెట్....

గత నవంబర్లో కరోనా కష్టకాలం ఉన్నప్పటికీ అన్నిటినీ అధిగమించి ఎంతో శ్రమకోర్చి మన శాస్త్రవేత్తలు విజయవంతంగా పిఎస్ఎల్వి సి–49 రాకెట్ను ప్రయోగించి అంతరిక్షంలో భారత్ సత్తాను చాటారు. తాజాగా పిఎస్ఎల్వి సి–50 రాకెట్ ఈ ఏడాదిలో రెండవది కావడం, సిఎంఎస్–01 ఉపగ్రహం 42వ సమాచార ఉపగ్రహం కావడం విశేషం. ఇస్రో ప్రయోగించిన పిఎస్ఎల్వి సి–50 రాకెట్ ఈ ఏడాదిలోనే రెండవ రాకెట్ ప్రయోగం కావడం విశేషం. అందులోనూ కరోనా నేపథ్యంలో శాస్త్రవేత్తలు కోవిడ్–19 నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూనే విధులు నిర్వహిస్తూ ఈ విజయం సాధించడం అద్భుతం. పిఎస్ఎల్వి సి–50 ప్రయోగ విజయంతో ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు దేశప్రజలు, ప్రముఖులు అందరిలోనూ సంతోష సంరంభాలు వెల్లివిరిశాయి. అంతరిక్షంలో ఎన్నో అద్భుత విజయాలు సాధిస్తున్న మన శాస్త్రవేత్తలు దేశవ్యాప్తంగా అందరి అభి నందనలను అందుకుంటున్నారు.

# నవరత్నాలపై కళాంజలి షార్ట్ ఫిలిం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా ప్రయోజన పథకాలు నవరత్నాలలో భాగమైన అమ్మఒడి, వైయస్ఆర్ ఆసరా, వైయస్ఆర్ ఆరోగ్యశ్రీ, వైయస్ఆర్ వృద్ధాప్య పింఛన్లు అనే నాలుగు పథకాలను పరిగణనలోకి తీసుకుని 'నవశకం' పేరుతో షార్ట్ ఫిలిం తయారవుతోంది. సీనియర్ దర్శకుడు, నటుడు, నిర్మాత కళాంజలి సంస్థ వ్యవస్థాపకుడు 'అనంత్' కథ, మాటలు, స్ర్కీన్ప్లే, దర్శకత్వం వహిస్తున్న ఈ లఘు చిత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నవరత్నాలపై నిర్వహిస్తున్న షార్ట్ ఫిలిం పోటీల కోసం తయారవుతోందని అనంత్ తెలిపాడు. పి.శివకుమార్ నిర్మాతగా రూపొందిస్తున్న ఈ లఘు చిత్రంలో శ్రీధర్, పార్వతీశం, యశోద(తిరుపతి), స్ఫూర్తిక, నరేంద్ర నటిస్తుండగా సంగీత్ సౌరభ్ సంగీతాన్ని అందిస్తున్నాడు, చైతన్య ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్నాడు.

## 'అమ్మఒడి' నమోదుకు 19 దాకా గడువు

అమ్మఒడి పథకం పొందేందుకు ఈనెల 19వ తేది వరకు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఈనెల 16న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన విద్యార్థుల వివరాలు, ఆధార్కార్డు, రేషన్కార్డు, బ్యాంక్ అకౌంట్ వగైరాలన్నీ ఈనెల 19వ తేది సాయంత్రం 5 గంటలకల్లా నమోదు చేయాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెడ్మాస్టర్లకు ఆయన సూచించారు.

## గౌరవపూర్వక కలయిక



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్రెడ్డిని డిసెంబర్ 15వ తేదీ మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో గౌరవపూర్వకంగా కలిసి తమ అనుబంధ సంస్థ రూపా పబ్లికేషన్స్ ప్రచురించిన గాజులపల్లి రామచంద్రారెడ్డి రచించిన 'భావితరాల భవిత మూడురాజధానులు' పుస్తకాన్ని అందిస్తున్న 'లాయర్' వారపత్రిక సంగ్రాహకుడు తుంగా శివప్రభాత్రెడ్డి

## దేశంలో...

# కోటికి చేరువగా కరోనా కేసులు

ప్రపంచవ్యాప్తంగా ప్రజలను వణికిస్తున్న కరోనా మనదేశంలోనూ వీరవిహారం చేస్తూనే ఉంది. రేపోమాపో దేశంలో కరోనా కేసులు కోటిని దాటేట్లుటున్నాయి. బుధవారం ఒక్కరోజే దేశవ్యాప్తంగా 26,382 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 387 మంది మరణించారు. ఈనెల16వ తేది నాటికి దేశంలో కరోనా బారిన పడిన వారి సంఖ్య 99 లక్షలా 32వేలా 547 కాగా, ఇప్పటికే లక్షా 44వేలా 96 మంది కరోనా రాకాసి కాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. మరో మూడు లక్షలా 32 వేల మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఈ వ్యాధితో చికిత్సలు పొంది వైద్య సిబ్బంది నిరంతర సేవలతో కోలుకుంటున్న వారి సంఖ్య కూడా ఆశాజనకంగానే ఉంది. ఇప్పటిదాకా 99.56 లక్షల మందికి పైగానే కోలుకోవడం సంతోషదాయకం. దేశంలో ఇప్పటిదాకా 15.66 కోట్లమందికి పైగానే కరోనా పరీక్షలు నిర్వహించారు.

### రాష్ట్రంలో 8.76 లక్షల మందికి పాజిటివ్

ఆంధ్రప్రదేశ్లో ఇప్పటిదాకా 8,76,814 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కోలుకుంటున్న వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది. చికిత్సలు పొంది ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి అయినవారు 8,65,327 మంది దాకా ఉన్నారు. ఈనెల 16 నాటికి అందిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో కరోనా వ్యాధితో 7067 మంది మృతిచెందారు.

### జిల్లాలో 21కి దిగిన కరోనా

నెల్లూరుజిల్లాలో గత కొద్దిరోజులుగా కరోనా వ్యాధి బాగా తగ్గుముఖం పట్టింది. వందల సంఖ్యల్లో వస్తున్న కేసులు ఇప్పుడు పదుల సంఖ్యకు దిగాయి. ఈనెల 17న కేవలం 21పాజిటివ్ కేసులు మాత్రమే నమోదయ్యాయి. మొత్తంగా ఇప్పటిదాకా 63,435 మంది కరోనా బారినపడగా, 62,864మంది కోలుకున్నారు. 586మంది మరణించారు.

### ప్రపంచంలో 7.40 కోట్ల మంది బాధితులు

కరోనా వైరస్ను నిరోధించేందుకు మనదేశంతో పాటు అనేకదేశాలు టీకాలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో మరోవైపు ఈ మహమ్మారి వ్యాధి ఇంకా కోరలు చాస్తూనే ఉంది. రోజురోజుకు పాజిటివ్ కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రపంచంలో ఇప్పటిదాకా 7కోట్లా 40 లక్షల మందికి పైగానే కరోనా సోకగా, వారిలో 16.46 లక్షల మంది మృతిచెందారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మరో కోటీ ఏడు లక్షల మంది పరిస్థితి విషమంగానే ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య త్వరలోనే 8 కోట్లకు చేరువ కావచ్చనే అంచనాలు అందరినీ విచారానికి గురిచేస్తున్నాయి. ఎక్కువగా ఐరోపా, అమెరికా దేశాలు, ఆసియా దేశాల్లో అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. అగ్రరాజ్యం అమెరికాలో కరోనా పంజా విసురుతూనే ఉంది. ఉత్తర, దక్షిణ అమెరికా దేశాల్లో రోజురోజుకు కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఉత్తర అమెరికాలో 1.98 కోట్ల మంది, దక్షిణ అమెరికాలో 1.21 కోట్ల మంది కరోనా బారిన పడ్డారు. మొత్తంగా మృతుల సంఖ్య 8 లక్షలకు పెరుగుతోంది. దీంతో అమెరికాతో పాటు అనేకదేశాల్లో కరోనా నివారణ వ్యాక్సిన్ తయారీ వేగవంతమైంది. ప్రపంచంలోని సకల మానవాళి అంతా కరోనా టీకా కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తోంది.

# పండుగ ముందే వచ్చింది

## బీసీ సంక్రాంతి వేడుకలో సీఎం జగన్



మహిళాభ్యుదయంలో మరో చరిత్రకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేర్కొన్నాడు. సంక్రాంతి పండుగ నెల రోజుల ముందే వచ్చిందా అన్నట్లు ఉందని తెలిపాడు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన బీసీ సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నాడు. వేడుక ప్రారంభానికి ముందు జ్యోతిరావ్ పూలే, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాడు. ఈ వేడుకలో ఆయన మాట్లాడుతూ.. ఇదే వేదికపై 18 నెలల క్రితం సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని, బీసీ కార్పొరేషన్లలో అత్యధిక శాతం నా అక్కాచెల్లెమ్మలే ఉండటం సంతోషంగా ఉందని, వెనుకబడిన వర్గాలకు ఈ స్థాయిలో పదవులు దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని,



అందులోనూ సగభాగం మహిళలకు ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదని అన్నాడు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, మన సంస్కృతికి వెన్నెముక కులాలని అంటూ... గత ప్రభుత్వం వెనుకబడిన కులాల వెన్నెముక విరిచిన పరిస్థితిని చూశామని, ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ఎన్నికల మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తానని, 18 నెలల్లోనే బీసీల సంక్షేమం కోసం రూ.38,519 కోట్లు ఖర్చు చేశామని, రైతు భరోసా ద్వారా బీసీలకు రూ.6140 కోట్లు పెట్టుబడి సాయం అందించామని, సున్నా వడ్డీ పథకం ద్వారా 7.14లక్షల బీసీ కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్తూ, ఈనెల 25న 31లక్షల మందికిపైగా ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నాడు. 15 రోజులపాటు ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారని, కోర్టు అనుమతి రాగానే లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేస్తాం.' అని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో చెప్పాడు. ఈ వేడుకలో ఉపముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, కొడాలి నాని, పేర్ని నాని, అనిల్‌కుమార్‌యాదవ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కురసాల కన్నబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఆదిమూలపు సురేష్, అవంతి శ్రీనివాస్, మాలగొండ్ల శంకరనారాయణ, గుమ్మనూరు జయరాం, సిదిరి అప్పలరాజు, వెలంపల్లి శ్రీనివాస్, పాండిచ్చేరి మంత్రి మల్లాడి, రాజ్యసభసభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి రమణ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల మంత్రిని కలిసిన పర్యాటక మంత్రి

- విశాఖలో పారిశ్రామిక ప్రగతిపై చర్చ



పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డిని పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం అమరావతిలో కలిశాడు. విశాఖను పారిశ్రామిక ప్రగతికి చిరునామాలా మార్చాలని పరిశ్రమల మంత్రి మేకపాటిని పర్యాటక మంత్రి కోరాడు. పారిశ్రామిక పార్కులు, వైజాగ్ కేంద్రంగా కారిడార్ల అభివృద్ధితో పాటు నగరంలో పర్యావరణాన్ని కాపాడే పరిశ్రమలకు పెద్దపీట వేయాలన్నాడు.

## పోరాడకపోతే.. బానిసలుగా మిగిలిపోతారు

**- అమరావతి రైతుల 'జనభేరి' సభలో చంద్రబాబు**



అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలని ప్రజలంతా పోరాటం చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చాడు. అమరావతి రైతుల రణభేరికి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం జరిగిన 'జనభేరి' సభలో ఆయన పాల్గొని ప్రసంగించాడు. 365రోజులు రైతులు ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారని, అమరావతి ఏకైక రాజధానిగా ఉండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను వెంకన్నను, దుర్గమ్మను కోరుకున్నానని, 'ఒక రాష్ట్రం – ఒక రాజధాని... అదే ప్రజా రాజధాని అమరావతి' అంటూ అందరూ కలసికట్టుగా నినదించాలని చంద్రబాబు కోరాడు.

## అభివృద్ధి పనులతో...

# కళ తెచ్చిన కాకాణి

### ఉప ముఖ్యమంత్రితో సహా కదిలొచ్చిన నలుగురు మంత్రులు



***సర్వేపల్లి నియోజకవర్గాన్ని సర్వతో ముఖాభివృద్ధి పథంలో నడిపించడానికి నడుంకట్టాడు శాసనసభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి. తన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఉపముఖ్యమంత్రి సహా ఏకంగా నలుగురు మంత్రులను రప్పించాడు. కరోనా కారణంగా పరిమిత జనంతో సందడిలేకుండా జరుగుతున్న కార్యక్రమాలతో కళతప్పిన నియోజకవర్గంలో ఒక్కసారిగా కాంతులు తీసుకొచ్చాడు. వందలాదిమంది నియోజకవర్గ ప్రజల సమక్షంలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలను, శంకుస్థాపనలను ఘనంగా నిర్వహింపజేశాడు.***

సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం మండలంలో వంద కోట్ల రూపాయలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటుచేసిన పైలాన్ ఆవిష్కరణోత్సవ సభకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో సహా నలుగురు రాష్ట్ర మంత్రులు తరలిరావడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాలను వారు ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. తొలుత ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖల మంత్రి కలత్తూరు నారాయణస్వామి మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున అమలవుతున్నాయని చెప్పారు. నవరత్నాల కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఏడాదికి ఒకటిన్నర లక్షల నుంచి రెండు లక్షల రూపాయల దాకా సంపాదన సమకూరేలా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని, ముఖ్యంగా రైతులకు రైతు భరోసా పథకంతో పాటు, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అన్నిటినీ ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 90శాతం దాకా అమలుచేశారని, గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రజల వద్దకే పథకాలను అందించడం జరుగుతోందని అన్నారు.



### తిరుపతి ఎన్నికల్లో అఖండ మెజార్టీ రావాలి

రాష్ట్ర పంచాయతిరాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం నవరత్నాల కార్యక్రమాన్ని అమలుచేస్తోందని, తిరుపతి ఉప ఎన్నికల్లో వైకాపాకు అఖండ మెజార్టీ వచ్చేందుకు కృషి చేయాలన్నాడు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేనివిధంగా కరోనా కష్టకాలంలోనూ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను పెద్దఎత్తున అమలుచేస్తూ ప్రజలను ఆదుకుంటోందన్నారు. పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిరంతరం అన్ని రంగాల అభివృద్ధికి కృషిచేస్తున్నారన్నారు. తొలుత వెంకటాచలం మండల కేంద్రంలో జలజీవన్ మిషన్ కింద 30 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు సంబంధించి పైలాన్‌ను వారు ఆవిష్కరించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ఉపముఖ్యమంత్రితో పాటు నలుగురు మంత్రులు, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, దివంగత తిరుపతి ఎంపి బల్లి దుర్గాప్రసాద్ కుమారుడు కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. పూడిపర్తిలో నిర్మించిన గ్రామ సచివాలయానికి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో ఉన్న రైతులకు 5.46 కోట్ల రూపాయల పంటల బీమా చెక్కును, బ్యాంక్ లింకేజి కింద స్వయంసహాయక సంఘాలకు 20.36 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు.

# ఇక నేరుగా.. ఇంటి వద్దకే రేషన్

### - ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం



ఇక రేషన్‌సరుకుల కోసం రేషన్ దుకాణాల వద్ద క్యూలో నిలబడి పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. రేషన్ సరుకులు తెచ్చుకోవడంలో పేదలు ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న అవస్థలను గమనించిన ప్రభుత్వం ఇక ఆ బాధలు లేకుండా చేస్తోంది. అధికారుల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల ముంగిళ్ల వద్దకే రేషన్ సరుకులను అందించేలా భారీ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలో 9.33లక్షలకు పైగానే రేషన్‌కార్డులున్నాయి. కొత్త సంవత్సరం కానుకగా జనవరి నుంచి లబ్ధిదారులకు ఈ ఏర్పాట్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీలోగా ఇళ్లవద్దకే వచ్చి రేషన్ సరుకులు అందించేందుకు అవసరమైన మినీట్రక్కులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 524 మినీట్రక్కుల ద్వారా రేషన్ సరుకులు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా రేషన్‌షాపులను, కార్డులను మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాలకృష్ణారావు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లన్నీ చురుగ్గా జరుగుతున్నాయి.

## 'ప్రభా'తం

# కాటేస్తున్న కాలుష్యాలు

**దేశంలో నానాటికీ మితిమీరిపోతున్న జలకాలుష్యం, వాయు కాలుష్యం వంటివి ప్రజల ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. ఈ కాలుష్యాల నివారణకు పాలకులు, ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేసైనా సరే.. ప్రజారోగ్య పరిరక్షణకు కంకణం కట్టుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాటేస్తున్న అన్ని రకాల కాలుష్య భూతాలను తరిమికొట్టేందుకు సత్వర చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ కాలుష్యాల వల్ల వచ్చే వ్యాధులతో ప్రజలు మరింతగా బాధలు పడాల్సి వస్తుంది.**

మనదేశంలోని ప్రధాన సమస్యల్లో కాలుష్యం ముందు వరుసలో ఉంది. జల కాలుష్యం, వాయు కాలుష్యం దేశ ప్రజల ఆరోగ్యాన్ని కకావికలం చేస్తున్నాయి. జలమే ప్రకృతిలోని ప్రతి ప్రాణికి జీవనాధారం. మనం తాగే నీరు, పీల్చే గాలి, తినే ఆహారం పరిశుభ్రంగా లేకుంటే అనారోగ్యం తప్పదు. ఇవన్నీ అందరికీ తెలిసిన విషయాలే అయినా నీటిని స్వచ్ఛంగా ఉంచుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం, పచ్చదనాన్ని సంరక్షించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో రకరకాల కాలుష్యాలు పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచంలో అత్యంత వాయుకాలుష్యం ఉన్న ఇరవై నగరాల్లో మనదేశానికి చెందిన 13 నగరాలు ఉండడం మనదేశంలో వాయుకాలుష్యం ఎంతగా పెరిగిపోతున్నదో స్పష్టం చేస్తోంది. వాహనాల ద్వారా 36 శాతం, వాహనాల ఉద్గారాల ద్వారా 25 శాతం పైగా, ఇంకా పరిశ్రమలు వగైరాల ద్వారా కూడా అత్యధికస్థాయిలో వాయు కాలుష్యం జరుగుతూనే ఉందని, గాలిలో దుమ్ము ధూళి పెరిగిపోయి కాలుష్యంగా మారి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. వాయు కాలుష్యాన్ని కొంతమేరకైనా నివారించేందుకు విద్యుత్ వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యర్థాలను వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని, సోలార్ వినియోగాన్ని పెంపొందించాలని, పర్యావరణ, వాతావరణ కాలుష్య నియంత్రణ మండళ్ళ సహకారంతో వాయు కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు అడుగు ముందుకు వేయాలని నిపుణులు పదేపదే సూచిస్తూనే ఉన్నా పట్టించుకునేవారే లేరు. ఇక జలకాలుష్యం సంగతైతే చెప్పాల్సిన పనే లేదు. ఎక్కడ చూసినా కాలుష్య కాసారాలే. దేశంలో ఎక్కడ చూసినా మురుగు, చెత్తా చెదారం పేరుకుపోతూనే ఉంది. మురుగునీటి పారుదల వ్యవస్థలు సక్రమంగా లేకపోవడం, ఇళ్ళలోంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేయడానికి తగు సదుపాయాలు మృగ్యం కావడం, తద్వారా తాగునీరు కలుషితం అవుతుండడం, పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేయకుండానే బయటకు వదిలేస్తుండడం, ప్రధానమైన నదులన్నీ కాలుష్యాలతో నిండిపోతుండడం వగైరాలన్నీ కలిసి వెరసి ప్రజారోగ్యాన్ని సర్వ విధాలా నాశనం చేస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు, పెద్ద పెద్ద నగరాల్లో కూడా ఎంతోకాలంగా ఇదే దుస్థితి. కాలుష్యాన్ని నివారించేందుకు, నివాసిత ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చెప్తున్న మాటలన్నీ నీటిమూటలుగానే మిగిలిపోతున్నాయే తప్ప ఆచరణలో అవి నామమాత్రమే అవుతున్నాయి. దేశంలో ఎంతో ప్రధానమైన వ్యవసాయ రంగంలో పురుగు మందులు, రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగిస్తుండడంతో భూగర్భజలాలు కాలుష్యమయంగా మారుతున్నాయి. పెద్దసంఖ్యలో ఉన్న పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం, వ్యర్థ జలాలు అన్నీ కూడా ఆయా ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పరిశ్రమల్లో వ్యర్థజలాలను శుద్ధిచేసే యంత్రాలు తక్కువే. జలకాలుష్యం వల్ల అనేకానేక వ్యాధులు ప్రబలిపోతున్నాయి. విషపూరితమైన రసాయనాలు నీటిని మరింతగా కలుషితం చేస్తాయి. కలుషిత నీటిని తాగితే నాడీ వ్యవస్థ, కాలేయం, మూత్రపిండాలు, కండరాలు అన్నీ దెబ్బతింటాయి. నీటి పైపులు కుళాయిల ద్వారా వచ్చే నీరు కొంతమేరకు మంచివే అయినప్పటికీ దేశంలోని అన్ని గ్రామాలు, అన్ని ప్రాంతాల్లో అలాంటి వసతులు ఉండడం లేదు. మనదేశంలో రక్షిత మంచినీరు అంతంతమాత్రంగానే ఉంటోందని, నీటి కొరత కూడా గణనీయంగా ఉందని ఎంతోకాలంగా నిపుణుల అధ్యయనాలు తేటతెల్లం చేస్తూనే ఉన్నాయి. స్వచ్ఛమైన మంచినీరు లభించకపోవడంతో నాణ్యత లేని..అందుబాటులో ఉన్న నీటిని తాగేస్తూ రకరకాల వ్యాధుల బారిన పడుతుండడం నిత్యకృత్యమైపోయింది. ఎంతోమంది ఈ బాధలతో మృతిచెందుతున్నారు కూడా. కలుషిత నీటి వల్ల బ్యాక్టీరియా, ఫంగస్, సీసం, నికెల్ వంటి పలు లోహకారకాలు శరీరాల్లో చేరిపోయి వ్యాధుల బారిన పడేస్తున్నాయి. తాగే నీటిలోనూ, తినే తిండిలోనూ విషపూరితమైన ఆహారపదార్థాలు చేరి సమస్యలకు దారితీస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ముఖ్యంగా తుఫాన్లు, భారీ వర్షాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లోనూ నీరు మరింత కాలుష్యమవుతుంటుందని, వీటి ప్రభావం ప్రజలపై మరింత ఎక్కువగా ఉంటుందని, పరిశుభ్రమైన నీటిని తాగాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్లుగా ఉన్న కాలుష్యాలు చాలక మరోవైపు ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతోంది. పర్యావరణాన్ని బాగా దెబ్బతీస్తోంది. వాడేసిన ప్లాస్టిక్‌సీసాలు, కవర్లు వగైరాల వల్ల కలిగే నష్టం అంతా ఇంతా కాదు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు ఇప్పుడు దేశమంతా ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నాయి. నేలలో కలిసిపోతున్న ఈ వ్యర్థాలు పూర్తిగా నశించిపోయేందుకు వేల సంవత్సరాలు పడుతుంది. ఈలోగా కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇంతగా దుష్ప్రభావం కలిగిన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు ప్రభుత్వాలు ఖచ్చితమైన చర్యలు తీసుకోకపోవడం విచారకరం. ఇకనైనా జలకాలుష్యం, వాయు కాలుష్యాలతో పాటు అన్ని రకాల కాలుష్యాలను నిరోధించేందుకు ప్రభుత్వాలు, ఎక్కడికక్కడ అధికారయంత్రాంగం, స్వచ్ఛంధసంస్థలు కలసికట్టుగా కృషిచేయడం అత్యవసరం. అందుకు నిపుణులు, మేధావులు, ప్రజలు కూడా పూర్తి సహకారం అందించాలి. మానవాళికి ప్రాణాధారమైన జలవనరులను పరిరక్షించుకోవాలి. పర్యావరణాన్ని కాపాడుకోవాలి. పచ్చదనాన్ని పరిశుభ్రతను ఎల్లవేళలా కాపాడుకోవాలి. మొక్కలు నాటి సంరక్షించుకోవాలి. సేద్యంలో రసాయన మందుల వినియోగాన్ని మానుకుని, సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపేలా రైతులను ప్రోత్సహించాలి. ప్రకృతి ప్రసాదిస్తున్న స్వచ్ఛమైన గాలిని, నీటిని మనకు మనమే కలుషితం చేసుకుని లేనిపోని అనర్థాలను తెచ్చుకునే దుస్థితి నుంచి ఇకనైనా బయటపడాలి. కాలుష్యాలను నివారించి స్వచ్ఛమైన గాలి, నీరు భావితరాలకు అందించడంలో మనం అందరికీ మార్గదర్శకం కావాలి. దేశంలో మితిమీరిపోతున్న జలకాలుష్యం, వాయు కాలుష్యం నివారణకు పాలకులు, ప్రభుత్వాలు అవసరమైతే కఠినమైన చట్టాలు చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని కాటేస్తున్న అన్ని రకాల కాలుష్య భూతాలను తరిమికొట్టేందుకు సత్వర చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఈ కాలుష్యాల వల్ల వచ్చే దుష్ప్రభావాలతో.. రకరకాల వ్యాధులతో ప్రజలు మరింతగా బాధలు పడాల్సి వస్తుంది.

# నిరక్షరాస్యుల నిర్లక్ష్యంతో రక్తం తాగుతున్న రహదారులు




రాష్ట్రంలో రహదారులు రక్తం తాగుతున్నాయి. నిరక్షరాస్యతతో, నిర్లక్ష్యంతో లారీ డ్రైవర్లు చేస్తున్న తప్పిదాలకు అమాయకులు బలైపోతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో జరుగుతున్న ఘోర రోడ్డు ప్రమాదాలలో ఈ రాక్షసులే యమకింకరులుగా మారి ప్రజల ప్రాణాలను బలిగొంటున్నారు. వందల మైళ్ళు ప్రయాణం చేసి అలసి పోయి నిద్ర రావడంతోనో, ఏవైనా చిన్న లోపాలు ఏర్పడడంతోనో రాత్రివేళల్లో రహదారులపైనే తమ వాహనాలను ఈ అజ్ఞానులు ఎక్కడ పడితే అక్కడ నిలిపి వేయడంతో పాటు కనీసం తమ వాహనాలు ఎదుటివారికి కనపడేలా పార్కింగ్ లైట్లను వేయకపోగా టైల్ లాంపులను కూడా అమర్చుకోకపోవడంతో ఈ భయంకర ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువ శాతం రాత్రివేళల్లో జరుగుతున్న ఈ ప్రమాదాలలో కొన్ని అమాయక కుటుంబాల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. మామూళ్ల మత్తులో తూగుతున్న రవాణా శాఖ అధికారులు కేవలం పగటి వేళల్లో వాహనాలను తనిఖీ చేస్తూ, లారీలకు రాత్రివేళల్లో అవసరమైన కనీస సదుపాయాలు ఉన్నాయా లేదా అని గుర్తించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికన్నా రవాణా శాఖ అధికారులు మేల్కొని భారీ వాహనాలకు ఉండవలసిన హంగులన్నీ ఉన్నాయా లేదా, ముఖ్యంగా రాత్రివేళల్లో అవి ప్రయాణించేటప్పుడు వెనుకవైపు కూడా వెలగవలసిన లైట్లు సక్రమంగా వెలుగుతున్నాయా లేదా అని చూడాలి. రాత్రి వేళల్లో హైవేలపై పెట్రోలింగ్ చేసే పోలీస్ వాహనాలను కూడా రోడ్డు ప్రక్కల పార్కింగ్ చేసుకుని హాయిగా నిద్రపోతున్నారు. అలాకాకుండా నిత్యం పర్యవేక్షిస్తూ ఎక్కడైనా వాహనాలను పార్కింగ్ చేసి ఉంటే వాటిని వెంటనే తొలగించడమో లేక అవి ఎదుటి వాహనాలకు కనపడేలా లైట్లను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టడమో చేస్తే రాత్రి వేళల్లో ప్రమాదాలు చాలా వరకు తగ్గే అవకాశం వుంది.

**బుల్లి జయరామిరెడ్డి,**
**నాయుడుపేట.**

# పెన్నా బ్యారేజీకి తిక్కన పేరు పెట్టాలి

నెల్లూరులోని పెన్నా బ్యారేజీకి మహాకవి తిక్కన పేరు పెట్టడం సమంజసం. ఇది మహాకవి తిక్కన మహాభారతాన్ని రచించిన ప్రదేశం. కవిబ్రహ్మ తిక్కన యజ్ఞం చేసి సోమయాజి అయిన పునీత తటం. ఇది భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన అపూర్వ పినాకినీ నదీ తీరం. ఈ పవిత్ర ప్రదేశంలోనే నెల్లూరు బ్యారేజీ నిర్మాణం జరుగుతున్నది కనుక ఆ బ్యారేజీకి తిక్కన గారి పేరు పెట్టడం ఎంతైనా సముచితం. కావున గౌరవ ప్రభుత్వం ఆ కోణంలో పరిశీలింప మనవి.

**ఆలూరు శిరోమణిశర్మ,**
**శ్రీ తిక్కన మహాకవి లలితకళాపీఠం, నెల్లూరు.**

**లాయర్**

**పాఠకులకు మనవి**
**మా(మీ) లాయర్ పత్రికకు**
**సమాచారం / లేఖలు**
**పంపదలచిన వారు**
**9866314741 నంబరుకు**
**వాట్సయాప్ ద్వారా గాని, లేదా**
**lawyerpatrika@gmail.comకి**
**ఈ-మెయిల్ ద్వారా గాని**
**పంపవలసిందిగా విజ్ఞప్తి.**
**పోస్టల్ చిరునామా :**
**ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,**
**మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.**
**- సం/-**

### పురాతన సంస్కృతిని ప్రతిబింబిస్తున్న

# టిటిడి 'గుడికో గోమాత'

తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి అధ్యక్ష్యులు వైవి సుబ్బారెడ్డి గారి సారధ్యంలో దేవస్థానాల పాలకమండలితో పాటు అధికారులు కూడా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ముదావహం. ముఖ్యంగా అనాదిగా వస్తున్న గోమాతని పూజించే ఆచారానికి పూర్వ వైభవం తెచ్చేలా "గుడికో గోమాత" పేరుతో రాష్ట్రంలో ఉన్న అన్ని హిందూ దేవాలయాలకు ఒక గోమాతను అందించే కార్యక్రమాన్ని చేపట్టడం శ్లాఘనీయం. విజయవాడ, కాకినాడ, హైదరాబాదులతోపాటు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా భారత దేశమంతా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి దాతలు ముందుకు రావాలని సుబ్బారెడ్డి గారు ఇచ్చిన పిలుపు మేరకు ఇప్పటికే చాలామంది ముందుకొచ్చి 216 గోవులను ఇప్పటివరకు అందించడం మంచి పరిణామం. ఇలాంటి కార్యక్రమాల వల్ల సమాజానికి శుభం జరుగుతుంది. గోమాతను పూజించడం అన్ని విధాలా శుభప్రదం. ఇలా ప్రతి గుడికి ఒక గోవును ఇచ్చి గోమాతను పూజించుకునే మహత్ భాగ్యానికి అవకాశం కల్పిస్తున్న టిటిడి వారికి ప్రత్యేకంగా వైవి సుబ్బారెడ్డి గారికి ధన్యవాదాలు.

**కె. యం. భూషణం, తిరుమల.**

# మొదలైన దోమల దాడి..!

నెల్లూరు నగరంలో దోమల దాడి మొదలయ్యింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఎక్కడ పడితే అక్కడ నీళ్లు నిలబడిపోవడంతో దోమలు కోట్ల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. డిసెంబర్ మాసం చలికాలం కూడా కావడంతో సాయంత్రం అయితే దోమల దండు దాడి మొదలుపెట్టి తమ ప్రతాపం చూపిస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు పన్నుల వసూళ్ల విషయంలో చూపించే శ్రద్ధ దోమల నిర్మూలనలో కూడా చూపించాలి. ఫాగింగ్ యంత్రాన్ని నెల్లూరు రోడ్లలో చూసి చాలా కాలమయ్యింది. మురుగు కాలువలను శుభ్రపరచడం నామమాత్రంగా మారింది. ఇకనైనా అధికారులు ఈ విషయాలపై శ్రద్ధ వహించి ఈ దోమల బారినుండి నెల్లూరు ప్రజలను కాపాడకపోతే కరోనా కేసులు తగ్గి ఇప్పుడిప్పుడే ఖాళీ అవుతున్న ఆసుపత్రులు మళ్ళీ రోగులతో నిండిపోతాయి.

**ఆర్. పి. రామయ్య, కొండాయపాళెం.**

# ఏమైపోతోందో... బుడత భవిత?

**అందుబాటులో ఉన్న ఆధునిక పరిజ్ఞానం, అవసరానికి మించి కంప్యూటర్ల వాడకం, వ్యక్తిగత పర్యవేక్షణా లోపంతో తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న అమ్మా నాన్నలు... ఇవీ ఇప్పుడు అనేక కుటుంబాలను కలవిస్తున్న దృశ్యాలు.**


ప్రపంచం శరవేగంగా ముందుకుపోతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోజుకొక కొత్త ఆవిష్కరణతో దూసుకుపోతోంది. సమాచార వ్యవస్థ అరచేతిలోకి వచ్చేసింది, మాయలఫకీరు మాయా దర్పణంలా సెల్ఫోన్‌లు ట్యాబ్లు అందుబాటులోకి వచ్చి ప్రపంచం నలుమూలలా జరిగే వింతలనూ విడ్డూరాలను అంతర్జాలంద్వారా క్షణాల్లో మన కళ్ళ ముందు దర్శింపచేస్తున్నాయి. గుడ్డి దీపాలు, బుడ్డిలాంతర్లు చూసిన తరం ఒక్కొక్కరుగా అంతరించిపోతుంటే, విలాసవంతమైన వసతులతో కులాసవంతమైన జీవితాలని అనుభవిస్తున్న నేటి తరం, పాత తరం జ్ఞాపకాలతోపాటు, ఆ తరం మనకు పరిచయం చేసిన ఆచారాలను, అలవాట్లను, నీతి నియమాలను, నైతిక విలువలను క్రమేణా మర్చిపోతోంది. ఆ పరిస్థితే నేటి తల్లితండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.

పాత రోజుల్లో బడికెళ్లాలంటే ఆరంభంలో చేతిలో పలకా బలపం, మరికొద్దిరోజులకు నోట్ పుస్తకం పెన్సిలు, ఇంకొంచం ఎదిగితే పెన్ను. అరనిక్కరుతో, చీమిడి ముక్కులతో, తలనిండా నూనె పెట్టుకుని ఎంత దూరమైనా సరే నడుచుకుంటూ బడికెళ్లాల్సిందే. విద్యాలయాన్ని దేవాలయంతో సమానంగా భావించి, గురువులను దేవుళ్ళలా కొలిచేవారు.

## కాలం మారింది...

ఇప్పుడు పరిస్థితి మారింది. ఈరోజుల్లో రెండేళ్ల బుడతడి చేతిలో ట్యాబ్, బడికెళ్లే నాలుగేళ్ళ పసివాడి జేబులో సెల్‌ఫోన్, రెండవ క్లాస్ చదివే ఆరేళ్ళ పిల్లవాడి గదిలో ల్యాప్‌టాప్ లేదా కంప్యూటర్. ఇదే ఇప్పుడు అమ్మా నాన్నలను ఆందోళనకు గురిచేస్తున్న అంశం. మొన్న మొన్నటి వరకు ఉదయం నుండి సాయంత్రం వరకూ స్కూల్లో టీచర్ల పర్యవేక్షణలో ఉంటుండిన తమ చిన్నారులు ఇప్పుడు కరోనా పుణ్యమా అంటూ ఇళ్లకే పరిమితమైపోయారు, ముఖ్యంగా కంప్యూటర్లకే అతుక్కుపోతున్నారు. ఇలాంటి తరుణంలో నిత్యం వాళ్ళని గమనించడం చాలా మంది పేరెంట్స్‌కి కష్టతరమైపోతోంది. ఉదయాన్నే ఆఫీసు కెళ్ళాల్సిన భర్త బాగోగులతో పాటు కుటుంబ బాధ్యతలు కూడా చూడవలసిన ఇల్లాలిది ఒక వేదనైతే, ఇద్దరూ పనిచేస్తే గాని ఇల్లు గడవని మధ్యతరగతి దంపతులది మరో వ్యథ. నిద్ర లేచిన దగ్గర నుండి సాయంత్రం వరకు కంప్యూటర్లకే అంకితమైపోతున్న తమ బిడ్డలను ఓ కంట కనిపెట్టి

## అమ్మానాన్నల్లో పెరుగుతున్న ఆందోళన



ఉండడం చాలామంది తల్లితండ్రులకు సాధ్యం కావడంలేదు, తమ పిల్లలు చదువుకుంటున్నారా... కంప్యూటర్లో గేమ్స్ ఆడుకుంటున్నారా... కార్టూన్స్ చూస్తున్నారా...? అన్న అనుమానం చిన్నపిల్లల తల్లితండ్రులదైతే, కేవలం ఒక్క క్షణంలో తెరపై ప్రత్యక్షమవుతున్న అశ్లీల వెబ్‌సైట్ల బారిన తమ పిల్లలు ఎక్కడ పడతారోనని యుక్త వయస్సులో ఉన్న బిడ్డల అమ్మా నాన్నలు కలత చెందుతున్నారు.

## ట్యూషన్ల వైపు మొగ్గు ...

ఎలాగూ స్కూళ్ళు లేవు కాబట్టి తమకు తెలిసిన టీచర్లను ఇంటికే పిలిపించి ఉదయం నుండి సాయంత్రం వరకు తమ పిల్లలకు ప్రయివేటు చెప్పించే ప్రయత్నం స్తోమత కలిగిన తల్లితండ్రులు చేశారని, కొంతమంది పాఠశాల నిర్వాహకులు చెప్తున్నారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులకు కూడా ఆర్థికంగా అది కొంత ఊరట కలిగించిందని, కాకపోతే అన్ని సబ్జెక్టులు చెప్పగలిగేవారు ఇప్పుడు చాలా అరుదుగా ఉంటున్నారని వారంటున్నారు. అయితే ఇలా ట్యూషన్ రూపంలో పిల్లలను పూర్తి స్థాయిలో ఒక వ్యక్తి పర్యవేక్షణలో ఉంచడం మంచి విషయమే అయినా ఇది అందరికి సాధ్యమయ్యేది కాదన్నది కూడా వారి అభిప్రాయం.

## 'పేరంటల్ లాకింగ్' ద్వారా నియంత్రించవచ్చు

ఈ తరంలో ముఖ్యంగా 12 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల పిల్లలతోనే ఎక్కువ శాతం సమస్యలు వస్తున్నట్టు తమ పరిశోధనలో తేలిందని, 15 సంవత్సరాలు దాటిన తరువాత వాళ్ళ ఆలోచనా విధానాలలో చాలా మార్పు వస్తోందని, గతంలో ఇలాంటి సమస్యలు 15 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల యువత వల్ల ఎక్కువగా వచ్చేవని, ఇప్పుడు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్టుగా చిన్న వయస్సులోనే పిల్లల ఆలోచనా విధానాలలో కూడా ఊహించని మార్పు వచ్చిందని ఒక సీనియర్ ఉపాధ్యాయుడు చెప్పాడు.

ముఖ్యంగా పిల్లలకు కంప్యూటర్లు ఇచ్చేటప్పుడు 'పేరంటల్ లాకింగ్' విధానం ద్వారా వారికి కావలసినవి మాత్రమే అందుబాటులో వుండే విధంగా కంప్యూటర్‌కి తాళం వేసి వాళ్ళని ఇతర వెబ్‌సైట్ల పట్ల ఆకర్షితులు కాకుండా నియంత్రించవచ్చని గూగుల్ ద్వారా అనేక రకాల సెక్యూరిటీ విధానాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పాడు. ఈ తరం పిల్లలకు వయసుకు మించిన స్వాతంత్ర్యాన్ని ఇచ్చి వాళ్లకి ఎక్కువ స్వేచ్ఛ కల్పించినందువల్లే కొంత శాతం మంది పిల్లలు చెడు మార్గాన్ని ఎన్నుకుంటున్నారని, అందుబాటులోవున్న అదే ఆధునిక పరిజ్ఞానం ద్వారానే తమకున్న పరిమిత సమయంలోనే పిల్లలను అదుపు చేయొచ్చని ఆయన అంటున్నాడు.

## కరోనాయే కారణం కాదు...

ఇప్పటి పిల్లల ప్రవర్తనకు కేవలం ఈ ఏడాది వచ్చిన కరోనాయే కారణం కాదన్నది కూడా మరికొంతమంది అభిప్రాయం. తల్లితండ్రుల ప్రవర్తనతో పాటు పిల్లల ఆలోచనా విధానాలలో కూడా చాలా మార్పులు వచ్చాయని, అమ్మానాన్నలు కూడా తమ తమ ఇళ్లల్లో పూర్తిగా టీవీలకో లేక సెల్‌ఫోన్లకో అంకితమైపోతుండడంతో పిల్లలపైన నియంత్రణ తగ్గిందని, అలా తల్లితండ్రుల నిర్లక్ష్యానికి గురైన పిల్లలు మాత్రమే చెడుమార్గంలోకి వెళ్తున్నారని ఇందులో పూర్తిగా పిల్లలని తప్పుపట్టలేమన్నది వారి అభిప్రాయం. కరోనా రాక ముందు కూడా ఎన్నో అనుభవాలను తాము చూశామని, ఇప్పుడు కరోనా కారణంగా ఆ శాతం కొంత పెరిగిందేతప్ప ఇలాంటి పరిస్థితికి కరోనాయే పూర్తి కారణంగా చూపడం సబబుకాదని వారంటున్నారు. పిల్లల భవిష్యత్తు వాళ్ళు చదువుకునే స్కూల్లో నేర్పే పాఠాలతో పాటు ఇంట్లో వారి తల్లితండ్రుల ప్రవర్తన మీద కూడా ఆధారపడి ఉందన్న విషయం పేరెంట్స్ గ్రహించాలని వారు కోరుతున్నారు.

## తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరం..

పిల్లలు బడిలో ఉన్నంతవరకే వారి బాగోగులను స్కూల్ యాజమాన్యం చూస్తుందని, ఒక్కసారి వాళ్ళు ఇంటికి వెళ్లిన తరువాత వారి నడక నడత పూర్తిగా తల్లి తండ్రుల ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుందని, ఈ విషయాన్ని అమ్మానాన్నలు గ్రహించి పిల్లలను తమ స్వీయ పర్యవేక్షణలో ఉంచుకుంటే తమ పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారవుతారని అంటున్నారు.

---

### 'ఉచిత పంటల బీమా' ఇచ్చాడు.. అన్నదాతలకు అండగా నిలిచాడు

# మా ఆత్మబంధువు.. జగన్



***దేశంలో మరెక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైయస్సార్సీపీ ప్రభుత్వం మొట్టమొదటిసారిగా రైతుల కష్టనష్టాల్లో ఆదుకుంటానంటూ ముందుకు వచ్చింది. పాదయాత్రలో జగన్ చెప్పిన మాటను పొల్లుపోకుండా నెరవేరుస్తూ అన్నదాతలకు అన్నివిధాలా సాయం అందిస్తూ ముందుకు సాగుతోంది. తాజాగా ఈనెల 15న రైతులకు 'వైఎస్సార్ ఉచిత పంటల బీమా' పథకాన్ని అమలుచేసి రైతుల ఆత్మబంధువుగా యువనేత జగన్ అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు. చరిత్రాత్మకమైన ఈ పథకం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా కర్షకలోకంలో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.***

## రాష్ట్రవ్యాప్తంగా కర్షకుల్లో హర్షాతిరేకాలు

ఆరుగాలం కష్టపడినా తీరా పంటలు చేతికందివచ్చే సమయానికి ఏ అతివృష్టో, అనావృష్టో దాపురిస్తే ఆ రైతుల గతి ఏంకావాలి?..కరువు కాటకాలు, వరదలు, చీడపీడలు ఒకటా రెండా.. ఎప్పుడూ అన్నదాతలకు ఏదో ఒక విధమైన బాధలే. అసలే ఈ కరోనా కష్టకాలంలో అష్టకష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలంటే ఎంతో గుండె నిబ్బరం కావాలి. చిత్తశుద్ధి కావాలి. ఆ రెండూ పుష్కలంగా ఉన్న యువనేత జగన్ చెప్పిన మాట తప్పకుండా రైతులకు ఎల్లవేళలా తన సహాయ సహకారాలందిస్తుండడం విశేషం.

గత ఏడాది పంటల సీజన్లో నష్టపోయిన 9.48 లక్షల మంది రైతులకు దాదాపు 1252 కోట్ల బీమా పరిహారాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమచేసి రైతులను ఆదుకోవడంలో తనకు తనే సాటి అని నిరూపించుకున్నాడు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులపై పైసా కూడా ఆర్థిక భారం లేకుండా, పూర్తి ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తూ, పంటలు సాగుచేసి ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి ఎకరాను పంటల బీమా పథకం పరిధిలో చేర్చి, రైతుల తరఫున ఆ బీమా సొమ్ము నంతా ప్రభుత్వమే చెల్లిస్తూ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తూ తమను అన్నివిధాలా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు, రాష్ట్రప్రభుత్వానికి రైతులు తమ కృతజ్ఞతలు చెప్తున్నారు. గత ప్రభుత్వం పంటల బీమా కోసం ప్రభుత్వ వాటాగా కేవలం 393 కోట్లు వెచ్చిస్తే, వైకాపా ప్రభుత్వం 2019లో రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటా 468 కోట్లతో పాటు, ప్రభుత్వ వాటాగా 503 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించి రైతుల పట్ల తనకున్న అభిమానం చాటుకుంది. 2020 ఖరీఫ్‌కు సంబంధించిన పంటకోతలు పూర్తయిన వెంటనే ఫిబ్రవరి నెలలో నివేదికలు వచ్చాక మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో బీమా పరిహారాన్ని రైతులకు చెల్లించేందుకు కూడా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ఇంత వేగంగా రైతులకు బీమా పరిహారం చెల్లింపులు జరగడం చరిత్రలో ఇదే ప్రథమం కూడా.

### రైతులకు ఇదో అద్భుతమైన పథకం

**- సిఎం వైఎస్ జగన్**

రైతులకు మంచి చేయాలనే సంకల్పంతోనే వైఎస్సార్ ఉచిత పంటల బీమా అనే అద్భుతమైన పథకాన్ని ప్రారంభించడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. ఈనెల 15న ఆయన తన క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఇది రైతుల మేలుకోరే ప్రభుత్వమన్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇన్సురెన్స్ సొమ్మును చెల్లించేవని, ఇప్పుడు ఆ సొమ్ము మొత్తాన్ని రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 2019 సీజన్‌లో కరువుల వల్ల, వర్షాల వల్ల నష్టపోయిన 9.48 లక్షల మంది రైతులకు 1252 కోట్ల రూపాయల బీమా సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమచేయడం జరుగుతోందన్నారు. చరిత్రలోనే తొలిసారిగా రంగుమారిన ధాన్యాన్నే కాక మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, నివర్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ఈనెల 31న ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయబడుతుందని చెప్పారు.

### జిల్లాలో 39,429 మంది రైతులకు 41.52 కోట్లు

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద నెల్లూరుజిల్లాకు సంబంధించి 2019 సంవత్సరానికి జిల్లాలో 39,429 మంది రైతులకు 41.52 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు చెప్పారు. ఆ చెక్కును ఆయన ఈనెల 15న లబ్దిదారులకు అందజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జేసీ హరేందిరప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహాసంఘం ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## బుద్ధిగా ఉండండి

**రౌడీషీటర్లను హెచ్చరించిన వేదాయపాళెం సిఐ**

రౌడీయిజం చెలాయిస్తే కఠిన దండన తప్పదని, రౌడీతనం మాని బుద్ధిగా నడచుకోవాలని లేకుంటే కఠిన దండన తప్పదని వేదాయపాళెం పోలీసులు రౌడీషీటర్లకు గట్టిగా క్లాసు పీకారు. ఈనెల 13న వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లను, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నవారిని ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. రౌడీషీటర్లు, అనుమానితులపై ఎప్పుడూ నిఘా ఉంటుందని, ప్రతి ఆదివారం అందరూ తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళాలని చెప్పారు. పద్ధతి మార్చుకుని మంచిగా ఉంటున్న వారి వివరాలను ఉన్నతాధికారులకు చెప్పి వారిపై ఉన్న రౌడీషీట్లు తీసేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐలు పుల్లారెడ్డి, లక్ష్మణ్, సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

**టిడిపిని..**

## అధికారంలోకి తేవాలి

**- అజీజ్ పిలుపు**

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ టిడిపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చాడు. ఈనెల 13న నెల్లూరులోని 26వ డివిజన్‌లో ఆయన టిడిపి కార్యకర్తలు, నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధే తన ధ్యేయమని, కార్యకర్తలకు ఎప్పుడూ తాను అందుబాటులో ఉంటానని, పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి తేవాలని చెప్పాడు. స్థానిక నాయకులు కృష్ణ, సుధాకర్, నరసింహులు, ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి ఆశయాలు ఆదర్శప్రాయం





అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 15న జిల్లా కలెక్టర్ తదితర అధికారులంతా నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలు ఆదర్శప్రాయమని, ప్రత్యేక తెలుగురాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయుని త్యాగనిరతి చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు చెప్పారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు, అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షుడు కెవి చలమయ్యను ఘనంగా సత్కరించారు. కలెక్టర్‌తో పాటు జేసీ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ సిఇఓ సుశీల, డిపిఓ ధనలక్ష్మి, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

**'భారతరత్న' ఇవ్వాలి..**

అమరజీవి పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' ఇచ్చి గౌరవించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ కోరారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన ఆర్యవైశ్య ప్రముఖులతో కలసి అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు ఒమ్మిన మురళి, అమరా వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, శ్రీరాం సురేష్, దాసా సురేష్‌రాజా పాల్గొన్నారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో అమరజీవి చిత్రపటాలు పెట్టాలి :**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలు పెట్టాలని, అసెంబ్లీ, పార్లమెంట్ ఆవరణల్లో అమరజీవి విగ్రహాలు ఏర్పాటుచేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కెవి చలమయ్య కోరారు. శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన నెల్లూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య ప్రముఖులు అనుమాలశెట్టి నరసింహులు, దాసా లక్ష్మీనారాయణ, మంచికంటి శ్రీనివాసులు, ఆర్‌వి శరత్, సొల్లేటి నాగేశ్వరరావు, నగరకంటి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన అమరజీవి :**

తెలుగువారి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణాలర్పించిన మహనీయుడు, తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి ఎంతో మహోన్నతమైనదని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి కొనియాడారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 68వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15న డిసిసి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నగరంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, నగర ఇన్‌చార్జి షేక్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లావుద్దీన్, డిసిసి కార్యదర్శి అరవ రాంప్రసాద్, నాయకులు షేక్ మన్సూర్, సయ్యద్ ఆష్రాఫ్ తదితరులు పాల్గొన్నారు.

**రంగనాథస్వామి సన్నిధిలో..**

## విద్యారణ్య భారతి స్వామి

నెల్లూరు రంగనాయకులపేటలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయానికి ఈనెల 13న హంపి విద్యారణ్య సంస్థానాధీశులు, పరమహంస పరివ్రాజకాచార్యులు విద్యారణ్యభారతి స్వామి విచ్చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామీజీకి ఘనస్వాగతం పలికారు. ఆలయ ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. ఆ తర్వాత స్వామీజీ శ్రీ పసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

**గౌడ కార్పొరేషన్ల**

## డైరెక్టర్లకు సన్మానం

నెల్లూరులోని నిప్పో సెంటర్‌లో ఉన్న గౌడసంక్షేమ కార్యాలయంలో ఈనెల 15న గౌడ కులాల కార్పొరేషన్ల డైరెక్టర్లకు సన్మానసభ నిర్వహించారు. గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి నరసింహులుగౌడ్ ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ 56 బిసి కులాల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిదేనని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఏపి గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు నాయుడు రాంప్రసాద్, కుసుమాంబ, అనిత, ఏడుకొండలు, కోటయ్యలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. గౌడసంఘం నాయకులు తిరకాల శ్రీనివాసులు, రావుల వెంకటేశ్వర్లు గౌడ్, దద్దోలు రమణయ్య, చక్రపాణి, ఏపూరు రమేష్, ఉదయగిరి శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ మధుర గీతాలతో..**

## పరవశించిన లోన్‌స్టార్ చర్చి



రానున్న క్రిస్మస్ పర్వదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 13న నెల్లూరు సుబేదారుపేటలో ఉన్న 'ది లోన్‌స్టార్ తెలుగు బాప్టిస్టు చర్చి'లో పలువురు గాయనీ గాయకులు ఎంతో హృద్యంగా క్రిస్మస్ గీతాలను గానం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. క్రీస్తు పుట్టుకను వివరించే గీతాలను అందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో అద్భుతంగా ఆలపించి అందరి కరతాళ ధ్వనులందుకున్నారు. రెవరెండ్ కంచర్ల ప్రభుదాస్ ఈ గీతాలను రచించాడు. సంఘసభ్యులు సుకేశిని నోబుల్, అనూరాధ, విక్టర్, జాన్‌ప్రసాద్ ఆ గీతాలకు స్వరకల్పన చేశారు. నిర్వాహకుడు రాయపు ఎగ్నోన్ నవరాజ్, సంఘ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కార్యదర్శి విక్టర్, కోశాధికారి మహిమాంబ తదితరులు ఈ గానలహరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

**పరిశుభ్రతలో మనం**

## నెం.1గా నిలవాలి

జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, నగరంతో సహా అన్ని ప్రాంతాలను పరిశుభ్రతలో నెంబర్ వన్‌గా నిలపాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పాడు. బుధవారం నెల్లూరులో ఆయన 'మనం – మన పరిశుభ్రత'లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించాడు. ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, తడి, పొడి చెత్తలను వేరుచేసి పరిశుభ్రతను పాటించాలన్నాడు. జిల్లాలో 'మనం – మన పరిశుభ్రత' కార్యక్రమంలో తొలివిడతగా 189 గ్రామాల్ని ఎంపిక చేశామని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరాడు.

## నెల్లూరు కబుర్లు

## అయ్యప్పగుడిలో.. మెట్ల పూజ



అయ్యప్పస్వామి మండల పూజలను పురస్కరించుకుని నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 13న స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు తొలుత స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం అయ్యప్పస్వామి సన్నిధిలోని మెట్లకు పూజలు చేశారు. నేత్రపర్వంగా జరిగిన ఈ కార్యక్రమాలకు దేవళ్ళ శ్రీధర్‌రెడ్డి–సుప్రజ, దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి–నిర్మల దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అయ్యప్పస్వామి సేవా సమాజం నిర్వాహకులు సుకుమార్, శేషగిరిరావు, సూర్యనారాయణ రెడ్డి, విజయకుమార్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఆసుపత్రికి రెండున్నర లక్షల విరాళం



ప్రముఖ వైద్యుడు సన్నపరెడ్డి మోహనరామిరెడ్డి తన తల్లిదండ్రులైన స్వర్గీయ సన్నపరెడ్డి కమలమ్మ–నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రెండున్నర లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈనెల 12న ఆయన తన సతీమణి సన్నపరెడ్డి కామాక్షమ్మ చేతుల మీదుగా ఆ విరాళాన్ని ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మికి అందించారు. ఆసుపత్రి అభివృద్ధికి ఆ మొత్తాన్ని ఖర్చుపెట్టాలని వారు కోరారు.

## రంగనాథుని సన్నిధిలో అధ్యయనోత్సవాలు

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల్లూరు రంగనాయకులపేటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో ఈనెల 14 నుంచి జనవరి 4వతేది వరకు 21 రోజుల పాటు పగల్‌పత్తు–రాపత్తు అధ్యయనోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, ఇ.ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామివార్లకు విశేష అలంకారాలు, విశిష్ట పూజలు చేస్తామని తెలియజేశారు.

**విఆర్ విద్యాసంస్థల కోసం...**

## ఆమంచర్ల కృషి అపారం

ఆమంచర్ల శంకరనారాయణ అంటేనే విఆర్‌సి గుర్తుకు వస్తుంది. విఆర్ విద్యాసంస్థల పరిరక్షణకు–అభివృద్ధికి ఆయన చేసిన పోరాటాలు జ్ఞాపకానికి వస్తాయి. అలా ఆయన చేపట్టిన అనేక ఉద్యమాలతో పాటు, విఆర్ విద్యాసంస్థలను పరిరక్షిస్తూ, అవి ఇంకా మంచి స్థాయిలో ఉండేందుకు అహర్నిశలు ఆయన చేసిన కృషి సాటిలేనిదని వక్తలు కొనియాడారు. నెల్లూరు రామలింగాపురంలోని శివాజీనగర్‌లో ఈనెల 13న ఏబివిపి పూర్వ విద్యార్థులు శంకరనారాయణ ద్వితీయ సంస్మరణ సభను ఏర్పాటుచేశారు. పలువురు ఏబివిపి, బిజెపి నాయకులు పాల్గొని శంకరనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఆయన విద్యారంగానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. విద్యార్థి దశ నుంచి ఏబివిపిలో ఉంటూ విద్యార్థి ఉద్యమాల్లో ఆరితేరిన శంకర నారాయణ విద్యారంగానికి, ప్రత్యేకించి విఆర్ విద్యాసంస్థల పరిరక్షణకు చేసిన సేవలను అమోఘమని అందరూ ప్రశంసించారు. విఆర్ విద్యాసంస్థల కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఆమంచర్ల శంకరనారాయణ విగ్రహాన్ని విఆర్‌సిలో ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి కోరారు. బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజక వర్గ అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బయ్యా వాసు, నాగరాజు, రామ దండు, సురేంద్ర, రంగరాజన్, గోపి, జగన్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శుభప్రదంగా ముగిసిన..కార్తీక మాసం



## దీపకాంతులతో శోభిల్లిన ఆలయాలు

## హోరెత్తిన శివ నామస్మరణలు

కార్తీకమాసం ఆఖరు సోమవారం రోజైన ఈనెల 14న జిల్లావ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. పుణ్యప్రదమైన ఈ కార్తీకమాసంలో పార్వతీ పరమేశ్వరులను భక్తితో పూజించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చారు. శివనామస్మరణలు చేస్తూ.. ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.

జిల్లావ్యాప్తంగా అన్ని శివాలయాల్లో సోమవారం కార్తీక మాసోత్సవాలు ముగిశాయి. కార్తీకమాసం చివరిరోజు సోమవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు ప్రత్యేక అలంకరణలతో సుందరంగా తయారయ్యాయి. కార్తీక దీపకాంతులతో ఆలయాలు శోభాయమానంగా వెలుగొందాయి. ఆలయాల్లో అర్చకులు పార్వతీ పరమేశ్వరులకు విశిష్ట అలంకారాలు విశేష పూజలు చేశారు. జొన్నవాడ కామాక్షితాయి దేవాలయం, వెంకటగిరిలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం, రాపూరులోని రామనాథేశ్వర స్వామి ఆలయం తదితర శివాలయాల్లో పరమశివునికి ప్రత్యేకపూజలు జరిగాయి. ఈ సందర్భంగా చేజర్ల మండలంలోని కోటితీర్థం శివాలయంలో మంత్రి మేకపాటి గౌతంరెడ్డి కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు.

అదేవిధంగా నెల్లూరు నగరంలోనూ కార్తీక మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. మూలాపేటలోని మూలస్థానేశ్వరాలయంలో విశేష పుష్పాలంకరణలు చేసి కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం వైభవంగా ప్రాకారోత్సవం నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకపూజలు చేశారు. ములుముడి బస్టాండ్ వద్ద ఉన్న భ్రమరాంబాదేవి సమేత హరిహరనాథాలయంలో కాశీ అన్నపూర్ణేశ్వర భక్తబృందం ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నదానం జరిగాయి. నవాబుపేటలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో పుష్పాభిషేకం, ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగాయి. ఇంకా నగరంలోని అనేక శివాలయాల్లో పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పలుచోట్ల మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు జరిగాయి. కార్తీక అమావాస్య సందర్భంగా కొన్ని ఆలయాల వద్ద పెద్దఎత్తున అన్నదానాలు చేశారు.

# రైతుల్ని వెంటనే ఆదుకోండి

## - జిల్లా అధికారుల్ని ఆదేశించిన మంత్రి గౌతంరెడ్డి



ఇటీవల తుఫాన్ల ప్రభావంతో కురిసిన భారీవర్షాల వల్ల నష్టపోయిన రైతుల్ని వెంటనే ఆదుకునేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, వాణిజ్యం, చేనేత శాఖల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈనెల 14న ఆయన ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశమై జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, తుఫాన్ నష్టాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తమ ప్రభుత్వం ఎల్లవేళలా రైతులకు అండగా ఉంటుందని, తుఫాన్ల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకుని తగు సాయం అందిస్తుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న రోడ్ల విషయంలో నష్టం అంచనాలు వగైరాలపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టాల అంచనాల్లో నిర్లక్ష్యం తగదని, నివర్–బురేవి తుఫాన్ల ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని మంత్రి ఆదేశించారు. నష్టపోయిన రైతులందరికీ 80 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీని కూడా ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన తెలిపారు. తుఫాన్ ప్రభావంతో సోమశిల జలాశయం కాలువల కరకట్టలు, ఆప్రాన్ దెబ్బతిన్నాయని సోమశిల జలాశయం అధికారులు మంత్రికి చెప్పగా, ప్రపంచబ్యాంకు నిధులు 66 కోట్లు మంజూరయ్యాయని, జనవరి నుంచి కమిటీ ద్వారా పనులు చేయించాలని అధికారులకు తెలిపారు. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఆత్మకూరు నియోజకవర్గంలో ఉపాధి పనులు 50 శాతం తక్కువగా గుర్తించినట్లు మంత్రికి తెలియడంతో, ఇలా ఉండడం సరికాదని, నెలాఖరులోగా ఈ నియోజకవర్గంలో 20 కోట్ల పనులు గుర్తించి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో ఇళ్ళస్థలాల ఎంపిక ప్రక్రియ మందకొడిగా సాగుతున్న విషయాన్ని గుర్తించిన మంత్రి, ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు లేకుంటే ప్రైవేటు స్థలాలను కొనుగోలు చేసి పేదలకు పట్టాలిచ్చేందుకు కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ ప్రభాకరరెడ్డి, ఆర్డీఓ సువర్ణమ్మ, మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఆర్‌అండ్‌బి ఇఇ మాల్యాద్రిరెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, ఓయస్డీ చెన్నయ్య, వైకాపా నాయకులు అల్లారెడ్డి ఆనందరెడ్డి, డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్, సిహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ ఛైర్మన్ ఎస్. ప్రతాప్‌రెడ్డి, షేక్ పర్వీన్, సూరా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల డ్యామ్.. పటిష్టతకు ఢోకా లేదు

### - చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి

సోమశిల డ్యామ్ పటిష్టంగానే ఉందని, జలాశయానికి ఎలాంటి ఢోకా లేదని తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి చెప్పారు. నివర్ తుఫాన్ దెబ్బతో డ్యామ్‌లోని ఆప్రాన్‌తో పాటు వరద రక్షణ కట్టడాలు ఇటీవల కోతకు గురైన నేపథ్యంలో ఆయన ఈనెల 15న వాటిని పరిశీలించారు. వరదనీటిని దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కులను సోమశిల డ్యామ్ నుంచి పెన్నానదికి విడుదల చేయడం జరిగిందని, దీంతో డ్యామ్ ఆప్రాన్ ప్రాంతం కొంత ఎక్కువగానే దెబ్బతినిందని, అయితే స్పిల్‌వే, స్టిల్లింగ్ బేసిన్, ఎర్త్‌డ్యామ్ అన్నీ పటిష్టంగానే ఉన్నాయని ఆయన తెలిపారు.

## బిజెపిలో చేరిన 60 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామంటున్న బిజెపి నాయకులు తమ మాటలను నిజం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఐటి సెల్, సోషల్ మీడియా ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు బిజెపి నాయకులు ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 14న పలు ప్రముఖ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న 60మంది బిజెపిలో చేరడం కలకలం సృష్టించింది. బిజెపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్‌యాదవ్ సమక్షంలో రాకేష్, పురంధర్, వంశీ నాయకత్వంలో వారంతా తమ పార్టీలో చేరడంతో బిజెపి నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. బిజెపి నాయకులు రాధాకృష్ణ గౌడ్, కెవి సుధీర్ పాల్గొన్నారు.

# గిరిజనుల సమస్యలు పట్టించుకోని ఐటిడిఏ

## సిబ్బంది నిర్లక్ష్యంపై పెద్దఎత్తున ఆందోళన

జిల్లాలోని యానాదుల సమస్యల పట్ల ఐటిడిఏ అధికారులు, సిబ్బంది ఎంతో నిర్లక్ష్యం చూపుతున్నారని, సమస్యలు తీర్చాల్సిన ప్రాజెక్టు అధికారి కావాలనే కాలయాపన చేస్తున్నాడని, ఏడాది గడుస్తున్నా ఆయన ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని, యానాదుల సమస్యల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉన్న ఆ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని గిరిజనులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. నెల్లూరులోని ఐటిడిఏ కార్యాలయం వద్ద ఈనెల 14న ఆంధ్రప్రదేశ్ యానాదుల గిరిజనుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాదులు మహాధర్నా చేపట్టారు. తమ బాధలు చెప్పుకునేందుకు వచ్చే యానాదుల పట్ల ఐటిడిఏ కార్యాలయం సిబ్బంది అత్యంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసి పెంచలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఏకి ఐఏఎస్ అధికారిని నియమిస్తే తప్ప గిరిజనులకు న్యాయం జరగదన్నారు. ప్రభుత్వం వెంటనే జిల్లాలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో తొలుత నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వద్ద నుంచి ఐటిడిఏ కార్యాలయం వరకు గిరిజనులు భారీ ర్యాలీ చేపట్టారు. యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్, రాపూరు కృష్ణయ్య, నాయకులు రవి, వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్ వలస కూలీలకు.. మెరుగైన వైద్యం అందించాలి

## - మాజీమంత్రి సోమిరెడ్డి



పొట్ట చేతపట్టుకుని పశ్చిమ బెంగాల్ నుంచి మన జిల్లాకు వచ్చిన పలువురు వలస కార్మికులు హఠాత్తుగా అస్వస్థతకు గురవడం, వారిలో ఒకరు మృతిచెందడం ఎంతో బాధాకరమని, ఈ ఘటనలో ఆసుపత్రుల పాలైనవారికి వెంటనే మంచి వైద్యం అందించాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లిలో అస్వస్థతకు గురై నెల్లూరులోని పెద్దాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ వలస కూలీలను ఈనెల 14న ఆయన పరామర్శించాడు. మృతుని కుటుంబానికి 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, బాధితులకు 50వేల రూపాయల వంతున ఆర్థికసాయాన్ని అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరాడు. ఘటనకు సంబంధించి ఇప్పటికీ స్పష్టమైన కారణాన్ని గుర్తించలేకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించాడు. మరోసారి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నాడు. ఏలూరులో ప్రజలు అస్వస్థతకు గురికావడానికి కూడా కారణం చెప్పలేక పోతున్నారని ఆయన అంటూ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, ప్రజలకు కష్టం వచ్చినప్పుడు స్పందించడం అలవరచుకోవాలని, కట్టుబట్టలతో ఉన్న బెంగాల్ కార్మికులకు మానవతా దృక్పథంతో సాయంచేసి వారిని సొంతరాష్ట్రానికి గౌరవంగా పంపాలని సూచించాడు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు, టిడిపి నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శీనయ్య, టిడిపి అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, నాయకులు జెన్ని రమణయ్య, జడ్.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల సమస్యలు తీర్చాలి



ప్రభుత్వాలెన్ని మారినా నేతన్నల పరిస్థితి మాత్రం మారడం లేదని, చేనేత కారులు నిత్యం ఎన్నో సమస్యలతో జీవితాలు సాగిస్తున్నారని, అందులోనూ ఇటీవల భారీవర్షాల వల్ల పనుల్లేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారని, వారిని వెంటనే ఆదుకోవాలని జనసేన నాయకుడు గునుకుల కిషోర్ కోరాడు. ఇటీవల ఆయన కోవూరు నియోజకవర్గం పాటూరులో ఉన్న చేనేత కార్మికుల కుటుంబాలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. నేతన్నలను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని, నేతకు అవసరమైన ముడిసరుకులను కొనుగోలు చేసుకునేందుకు రుణాలు ఇప్పించాలని, నేసిన వస్త్రాలను మార్కెట్‌లో అమ్ముకునేందుకు తగు వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు. నేతకార్మికులకు జనసేన అండగా ఉంటుందన్నాడు.

## ఓటు హక్కుపై ...
# ప్రజల్లో అవగాహన కల్పించాలి

### - ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కెఆర్‌బిహెచ్ఎస్ చక్రవర్తి



ఓటు హక్కుపై ప్రజల్లో బాగా అవగాహన కలిగించాలి. ఓటు నమోదుకు సంబంధించి ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి. తప్పులు లేని ఓటర్ల సవరణ జాబితాను తయారుచేయాలి'.. అంటూ ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ కెఆర్‌బిహెచ్ఎస్ చక్రవర్తి జిల్లా అధికారులను ఆదేశించారు.

ఈనెల 13న ఆయన నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2021పై జిల్లాలోని అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అందరూ తప్పని సరిగా పాటించాలని, ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. ముఖ్యంగా 18 ఏళ్ళు నిండిన యువతను గుర్తించి వారికి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేసి ఓటరుగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటర్ల పేర్లు తప్పులుగా నమోదు కావడం, లింగభేదం, చిరునామా, ఒకరి బదులు మరొకరి పేర్లు రావడం వంటి పొరపాట్లను అధికారులు సరిచేయాలని, ఓటర్ల జాబితా తయారీలో రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్ల భాగస్వామ్యం ఉండాలని తెలిపారు. తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని ఆయన అన్నారు.

#### సవరణ ప్రక్రియను పటిష్టంగా చేస్తున్నాం - కలెక్టర్

సమావేశంలో కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఓటర్ల సవరణ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పటిష్టంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 31,85,560 మంది జనాభా ఉన్నారని, 2020 నవంబరు 16 నాటికి జిల్లాలో 24,35,035 మంది ఓటర్లున్నారని, వీరిలో పురుషులు 11,92,916 మంది, మహిళా ఓటర్లు 12,41,747 మంది ఉన్నారని, ఇతరులు 372 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో 2915 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. నెల్లూరు నగరం, పట్టణ ప్రాంతాల్లో ఇంటి డోర్‌నెంబర్లు సరిగా లేక ఒక కుటుంబంలోని వ్యక్తులను వేరు వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం వంటి సమస్యలున్నాయని ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు రాజకీయపార్టీల ప్రతినిధులు అబ్జర్వర్ దృష్టికి తీసుకువచ్చారు. జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్, గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, డిఆర్ఓ నాగలక్ష్మి, ఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి కలెక్టర్
# బుచ్చిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాలెం మండలంలో పలు అభివృద్ధి పనులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఈ నెల 14న బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో 3.15 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరోనా కేసులు తగ్గుముఖం పడుతున్నా, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సిందేనన్నారు. జిల్లాలోని 17 సామాజిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రప్రభుత్వం 70 కోట్ల రూపాయలను మంజూరు చేసిందన్నారు.

#### మునులపూడి చెరువు పనులకు శంకుస్థాపన

అదేరోజు మునులపూడి గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద 90లక్షల వ్యయంతో చేపడుతున్న చెరువు పునరుద్ధరణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అన్నదాతల సంక్షేమానికి ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందని చెప్పారు. అనంతరం 'జగనన్న తోడు' పథకం కింద 1139 మంది లబ్ధిదారులకు కోటి 13 లక్షల రూపాయల చెక్కులను కలెక్టర్‌తో కలిసి పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, బుచ్చి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

---

## గూడూరు డివిజన్ వార్తలు

# సత్ప్రవర్తనతో మెలగండి

### - రౌడీషీటర్లకు సి.ఐ దశరథరామారావు హితబోధ




ఇటీవల గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు పట్టణ సి.ఐ జి.దశరథరామారావు కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలుగుతూ, రౌడీయిజం, దొంగతనాలు తదితర నేరాలకు దూరంగా ఉండాలని హితబోధ చేశారు. ఎస్సై సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు




గూడూరు నెల్ క్యాస్ట్ కంపెనీ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, ధర్మవ్యూహం ప్రతినిధి పేర్నేటి విజయభాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఇటీవల నిరుపేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. విజయభాస్కర్‌రెడ్డి సతీమణి విరజ, కుమార్తె వీణ, అల్లుడు అమర్నాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణులకు 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కరోనా నేపథ్యంలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న బ్రాహ్మణులకు తమవంతు సాయంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బిల్లుల రద్దు కోరుతూ
# రైతు సంఘాల నిరసన



రైతులకు అన్యాయం చేసే వ్యవసాయ బిల్లులను వెంటనే కేంద్రప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 15వ తేదీ సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో రైతు సంఘం నాయకులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు.

ముందుగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు నేతృత్వంలో, ఢిల్లీలో రైతులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా రైతు కూలీ సంఘం, గూడూరు రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఎద్దుల బండ్లతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు శివకుమార్, కౌలు రైతు సంఘం నాయకులు ఎన్.యాదగిరి, ఎ.కేశవులు, పి.మణి పాల్గొన్నారు.

# వృద్ధులకు అన్నదానం



గూడూరు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ సాయిరామ్ చారిటీస్ వృద్ధాశ్రమంలో 40మంది వృద్ధులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఒకటవ పట్టణ సి.ఐ దశరథరామారావు చేతులమీదుగా అన్నదానం చేశారు. స్వర్గీయ మనపాటి చంటి జ్ఞాపకార్థం ఆయన పుట్టినరోజున తండ్రి మనపాటి శ్రీనివాసులు సహాయసహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, లాయర్ ప్రతాప్, కార్యవర్గ సభ్యులు, కో-ఆర్డినేటర్ సతీష్, నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.



# 'అమరజీవి'గా చరిత్రలో నిలిచారు

### సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 68వ వర్ధంతి సందర్భంగా ఈనెల 15వతేదీ గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి కోసం భాష ప్రాతిపదికన తెలుగు రాష్ట్రం ఏర్పడాలని ఆమరణ నిరాహారదీక్షకు దిగి చివరికి తన ప్రాణాలను సైతం అర్పించి అమరజీవిగా శ్రీ పొట్టి శ్రీరాములు చరిత్రకెక్కారని గోపాలకృష్ణ కొనియాడాడు.

## మదమనూరుకు
# బస్సులు నడపండి

### సీపీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా...



మనుబోలు మండలం మదమనూరు గ్రామానికి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం సీపీఐ నాయకులతో కలిసి ఆ గ్రామ విద్యార్థులు, యువకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సీవీఆర్ కుమార్ మాట్లాడుతూ మదమనూరుకు కరోనాకు ముందు బస్సు సర్వీసు ఉండేదని, ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఆటోలు సమయానికి అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మస్తానయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన డిపో మేనేజర్‌తో చర్చించి విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, మదమనూరు గ్రామ విద్యార్థులు పాల్గొన్నారు.

# పిసిసి అధికార ప్రతినిధిగా లేళ్ళపల్లి

## జిల్లా కాంగ్రెస్‌కే గర్వకారణమన్న చేవూరు



ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా జిల్లా నుంచి లేళ్ళపల్లి సురేష్‌బాబు నియమితులయ్యారు. సురేష్ బాబు స్వస్థలం కావలి. 1977లో కాంగ్రెస్ రాజకీయాల్లోకి వచ్చిన సురేష్‌బాబు ఎన్ఎస్‌యుఐ తాలూకా అధ్యక్షునిగా, ఆ తర్వాత కావలి తాలూకా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేసి పార్టీలో మంచిగుర్తింపు పొందారు. దాంతో ఆయనకు జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్ష పదవి, ప్రధానకార్యదర్శి పదవులు కూడా లభించాయి. దాదాపు పదిహేనేళ్ళుగా జిల్లా సేవాదళ్ అధ్యక్షునిగా కూడా క్రమశిక్షణతో పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. కావలిలోని విశ్వనాథరావుపేట మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా మూడు సార్లు విజయం సాధించి అందరి అభిమానాన్ని పొందిన ఆయన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కూడా సేవలందించడం విశేషం. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సురేష్‌బాబు తొలినుంచి ఎంతో క్రమశిక్షణతో పాటు కృషి, పట్టుదల ఉన్న వ్యక్తి అని, రాజకీయ రంగంలో అపార అనుభవం ఉన్న లేళ్ళపల్లిని పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా నియమించడం సంతోషంగా ఉందని, ఈ పదవికి లేళ్ళపల్లి నియామకం జిల్లా కాంగ్రెస్‌కే గర్వకారణమని అంటూ, పిసిసి నుంచి వచ్చిన నియామకపత్రాలను ఈనెల 13న ఆయన సురేష్‌బాబుకు అందజేశారు.

# శివదీక్ష భక్తులతో కిటకిటలాడిన మూలస్థానేశ్వరాలయం

● పరమశివునికి ప్రత్యేక పూజలు, సేవలు

నెల్లూరు శివాలయంగా పేరుబడ్డ మూలస్థానేశ్వరాలయానికి ఇరుముడి కట్టుకుని శివదీక్షలో ఉన్న భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. 'శివా!శివా!..ఓం నమ: శివాయ!.. హరహర మహాదేవ'...అంటూ పెద్దపెట్టున శివ నామస్మరణలు చేశారు. దీంతో మూలస్థానేశ్వరాలయం శివ నామజపంతో మార్మోగింది. జిల్లాకు చెందిన ప్రముఖ దాత, ధార్మికసేవాపరాయణుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో ఇటీవల శివదీక్షలు చేపట్టిన దాదాపు 350 మందికి పైగా భక్తులు ఈ దీక్షలు ముగుస్తుండడంతో ఈనెల 13న మూలాపేటలోని పుష్పగిరిమఠంలోని శివాలయంలో ఇరుముడులు కట్టుకుని, అక్కడినుంచి శివనామ స్మరణలు చేస్తూ మూలస్థానేశ్వరాలయానికి వచ్చి పరమశివునికి ఇరుముడులు సమర్పించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేసి శివపంచాక్షరీ మంత్రాన్ని అఖండ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి



సహకారంతో ఏటా వందలాదిమంది భక్తులు శివదీక్షను చేపడుతుండడం ఎంతో హర్షదాయకమన్నారు. తొలుత, కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి కన్నుల పండువగా పుష్పాభిషేకంతో పాటు ప్రాకారోత్సవం నిర్వహించారు. పుష్పాభిషేకానికి పోలుబోయిన కోటమ్మ, రూప్‌కుమార్ యాదవ్, దయాకర్, ప్రశాంతి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రాకారోత్సవానికి ఉభయకర్తలుగా కోవూరు వెంకురెడ్డి-ధనమ్మ వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఇ.ఓ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

# ఆ సాగు చట్టాలు వద్దనే వద్దు!

## వ్యవసాయ సంఘాల ఆందోళన

కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన వ్యవసాయ చట్టాలు రైతులను దివాలా తీయించేవిధంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దుచేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 14న నెల్లూరులో రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రధాని మోడీ చెప్తున్నారని, కానీ ఆ ఫలసాయం రవాణా, మద్దతు ధరపై మాత్రం చట్టం చేయలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకమ రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పులిగుండ్ల శ్రీరాములు, సిఐటియు జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పినాకిని గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకిని గాంధీ ఆశ్రమంలో ఈనెల 13న ఉపాధ్యాయులు ఎస్‌డి నస్రీన్, ఎస్‌డి మహబూబ్‌బాషాల ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు జరిగాయి. తొలుత జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ నిర్మాణ కర్త పొణకా కనకమ్మ విగ్రహానికి నూలుమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు మంజుల, మేనేజర్ రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య ప్రముఖుల వివరాలతో...

# 'ఆర్యవైశ్య దీపిక' ఆవిష్కరణ

జిల్లాలోని 46 మండలాల్లో ఉన్న ఆర్యవైశ్య ప్రముఖుల వివరాలతో కూడిన 'ఆర్యవైశ్య దీపిక-2020' సావనీర్ ఆవిష్కరణ ఈ నెల 13న ఎంతో ఘనంగా జరిగింది. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ ఆవిష్కరణ సభలో పాల్గొన్న జిల్లా ఆర్యవైశ్య సంఘం రూరల్‌శాఖ అధ్యక్షుడు తిరివీధి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘాలను మరింత పటిష్టవంతం చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆర్యవైశ్యులందరిని సమీకరించి వారికి సంఘం విశిష్టతను తెలియజేయాలన్నారు. కావలి మునిసిపల్ మాజీఛైర్మన్ పోతుగంటి అలేఖ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దాతృత్వానికి ప్రతీకలని, ఆర్యవైశ్యులుగా జన్మించడం మనందరి అదృష్టమని, జాతిపిత మహాత్మా గాంధీజీ, అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని అందరం ముందుకు సాగాలన్నారు. ఈ పుస్తకం ఆవిష్కరణకు ఎంతో శ్రమించిన తిరివీధి రాధాకృష్ణయ్యను అందరూ అభినందించారు.



ఈ కార్యక్రమంలో సావనీర్ ముఖ్య సలహాదారు మొగళ్లూరు వెంకటశేషయ్య, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ కార్యదర్శి తిరివీధి ప్రకాశ్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లబోతు వెంకటేశ్వర్‌రావు, ఆర్యవైశ్య ప్రముఖులు పేరకం వేణుగోపాల్‌రావు పెసల జయరాజ్‌గోపాల్, గాదంశెట్టి గోపాల్, మల్లుంగి వెంకటేశ్వర్లు, కోట గురుబ్రహ్మం తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్ ప్రోత్సాహకులను ఘనంగా సన్మానించారు. తొలుత జిల్లాలో కరోనాతో మృతిచెందిన ఆర్యవైశ్యుల మృతికి సంతాపం ప్రకటించారు.

# చరిత్రాత్మకం, మహిమాన్వితం.. కావలి శివాలయం

***కావలి శివాలయం.. దాదాపు వెయ్యేళ్ళనాటి ఒక చరిత్రాత్మక దేవాలయం. నెల్లూరుజిల్లాలోని కావలి చరిత్రకు ఇది ప్రత్యక్ష సాక్ష్యం. దుర్గా భ్రమరాంబాదేవి సమేత శ్రీ మల్లేశ్వరస్వామి కొలువైన ఈ శివాలయం రాజుల కాలం లోనూ ఒక వెలుగు వెలిగింది. కోరిన కోర్కెల తీర్చే పరమశివుని ఆలయంగా, భక్తుల కొంగుబంగారంగా ఉన్న ఈ మహా మహిమాన్విత ఆలయం జిల్లాలోని ప్రాచీనమైన శైవక్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచింది.***

జిల్లాలోని అత్యంత పురాతనమైన శివాలయాల్లో కావలి శివాలయం ఒకటి. ఇక్కడ శివుడు స్వయంభువు. దుర్గా భ్రమరాంబాదేవి సమేతుడైన మల్లేశ్వరస్వామి ఇక్కడ కొలువై భక్తజనుల ఆర్తిని బాపుతున్నాడు.

### ఆలయ చరిత్ర :

ఈ శివాలయం ఎంతో ప్రాచీనమైనదని, సుమారు వెయ్యేళ్ళ క్రితం నాటిదని ఈ ఆలయంలో లభించిన కొన్ని శిలలపై చెక్కిన శాసనాల ద్వారా తెలుస్తోంది. కావలి ప్రాంతంలో మొట్టమొదటి ఆలయం కూడా ఈ శివాలయమేనని అంటారు. పినాకిని నదీ తీరానికి ఉత్తరభాగంలో, సముద్ర సమీపంలో బ్రామరీఘట్టంలో ఉగ్రలింగ స్వరూపుడై ఇక్కడ పరమశివుడు స్వయంభువుగా వెలిశాడని పెద్దలు చెప్తున్నారు. నాటి చోళ రాజులు, కాకతీయ రాజులు, తుళువ వంశ రాజులు ఈ ఆలయాన్ని సందర్శించినట్లు, అప్పట్లో ఈ ఆలయం ఎంతో వైభవంగా వెలుగొందుతోన్నట్లు చరిత్ర. ఇందులో విజయ నగరాన్ని పాలించిన తుళువవంశం ప్రభువుల కాలం నాటి శిలాశాసనం కూడా ఉంది. ఉదయగిరిని జయించాక హరిహరరాయలు సముద్రస్నానానికి వెళ్తూ మార్గమధ్యంలో ఈ స్వామివారిని దర్శించుకున్నట్లు చారిత్రిక ఆధారాలున్నాయి.





మన దేవాలయాలు (25)

ప్రఖ్యాతి చెందిన అమరశిల్పి జక్కన వంశీయులు చెక్కిన అపురూపమైన శిల్పాలు ఇక్కడ దర్శనమిస్తాయి. పురాతన కాలంలో భ్రమరాంబాదేవి సమేత మల్లికార్జునస్వామిగా పూజలందుకుంటున్న ఈ శివాలయం, కాలక్రమంలో రుద్రపాద క్షేత్ర శ్రీ దుర్గా భ్రమరాంబాదవి సమేత మల్లేశ్వరస్వామిగా ప్రఖ్యాతిచెందినట్లు తెలుస్తోంది. శైవాచార్య గురుకుల్ సంప్రదాయ పద్ధతిలో ఇక్కడ పూజలు జరుగుతుంటాయి. సుమారు 250 ఏళ్ళ క్రితం ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలు కావలిలోని కేతిరెడ్డి కుటుంబీకులు నిర్వహించారు. అనంతరం ప్రతి అరవై ఏళ్ళకోసారి మహాకుంభాభిషేకాలు జరుగుతుండడంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

### మరెన్నో అపురూప ఆలయాలు :

ఈ ఆలయ ప్రాంగణంలోనే మహానంది, రాజ మహాగణపతి, బ్రహ్మ, జ్ఞానసరస్వతి, షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కేశవస్వామి, రాజదుర్గాదేవి అమ్మవారు, కాలభైరవుడు, నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు మేధా దక్షిణామూర్తి ఆలయం, ఆనంద నటరాజస్వామి ఆలయం, చెంచులక్ష్మీదేవి అమ్మవారి ఆలయం, చండీశ్వరాలయంతో పాటు విశేషమైన సత్యభాస్కర ఆలయం, నవగ్రహ మండపం, యాగ మండపం వగైరాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటూ ఉంటాయి. కాలక్రమేణా పలు ఆలయాలను ఇక్కడ ఏర్పరచారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి రాహుకాలం సమయంలో విశేష పూజలు జరుగుతుంటాయి. అమ్మవారికి నిమ్మకాయలతో పూజలు చేస్తే అవివాహితులకు వివాహం జరుగుతుందని, ప్రతిఏటా శివాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణ సమయంలో ధ్వజ ప్రసాదం స్వీకరిస్తే సంతానం లేని వారికి తప్పకుండా సంతానం కలుగుతుందని ప్రతీతి.

### మహిమాన్వితం.. తిరుగుడు నంది

ఆలయంలోని శివలింగానికి ఎదురుగా ఉన్న 'తిరుగుడు నంది' ఈ ఆలయంలో ఒక ప్రత్యేకత. ఈ నంది దేవునికి పూజలుచేస్తే ఎలాంటి దీర్ఘవ్యాధులైన ఉపశమిస్తాయని, ఎంతటి కష్టాలైనా తొలగిపోతాయని భక్తులు చెప్తుంటారు. ఎంతో మహిమాన్వితమైన ఈ ఆలయాన్ని గతంలో మాజీప్రధాని ఇందిరాగాంధీ మూడుసార్లు దర్శించుకోవడంతో పాటు, నిత్యం ఎందరో ప్రముఖులు, అనేక మంది రాజకీయ నాయకులు కూడా వచ్చి దర్శించుకుంటుంటారు. ఈ ఆలయంలో ఏటా జరిగే ఉత్సవాలకు, ఆలయ సమీపంలోని పుష్కరిణిలో జరిగే తెప్పోత్సవాలకు భక్తజనం కొల్లలుగా వస్తుంటారు. నేటికీ ఆలయ నిర్వాహకులు, అర్చకుల ఆధ్వర్యంలో కావలి శివాలయం నిత్యపూజలతో భక్తుల సందడితో కళకళలాడుతూనే ఉంది.



# ఉపరాష్ట్రపతిని కలిసిన రావిప్రోలు

ఇటీవల విశాఖపట్టణానికి వచ్చిన భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడుని ఈ నెల 11వ తేదీన నెల్లూరు జిల్లా పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమం కమిటీ సభ్యుడు రావిప్రోలు సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలుసుకున్నాడు. ఫిబ్రవరి నెలలో జరగబోయే గాంధీ ఆశ్రమ శత వసంతాల ఉత్సవ కార్యక్రమానికి విచ్చేయాలని ఉపరాష్ట్రపతిని కమిటీ తరఫున ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారని సుబ్రహ్మణ్యం తెలిపాడు. ఈ సందర్భంగా నివర్ తుఫాన్ వల్ల ఆశ్రమానికి వాటిల్లిన నష్టాన్ని కూడా వెంకయ్యానాయుడి దృష్టికి తెచ్చాడు. ఆసక్తిగా అన్ని విషయాలు విన్న వెంకయ్య, వీలైనంత త్వరగా నష్టనివారణ చర్యలు తీసుకునే విధంగా ఆదేశిస్తానని చెప్పారని సుబ్రహ్మణ్యం తెలియజేశాడు.

దివంగత భారతీయ సినిమా గాయకుడు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆప్తమిత్రులలో ఒకరైన రావిప్రోలు సుబ్రహ్మణ్యం, బాలూ చికిత్స విషయంలో ఉపరాష్ట్రపతి చూపిన చొరవకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపాడు.

### ఎమ్మెల్యే ప్రసన్న

# పుట్టినరోజు వేడుకలు



కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఈనెల 12న కోవూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అనేక మంది అభిమానులు కేకులు కట్‌చేసి అందరికీ తినిపించి సంబరాలు చేసుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో స్థానికులు, అభిమానులు పెద్దఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. బుచ్చిలోని వవ్వేరు బ్యాంక్ ఆవరణంలో కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వవ్వేరు బ్యాంక్ ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి, పెన్నాడెల్టా ప్రాజెక్టు ఛైర్మెన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు ఎన్. వెంకటేశ్వర్లునాయుడు, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షేక్ అల్లాబక్ష తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోవూరు తాలూకా కార్యాలయంలోనూ ప్రసన్న జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ ఛైర్మెన్ రాధాకృష్ణారెడ్డి తదితరుల పర్యవేక్షణలో రక్తదాన శిబిరం కూడా నిర్వహించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత ఈ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు జి.భాస్కర్‌రెడ్డి, ఏ.సుబ్రహ్మణ్యం, ఎం.చిరంజీవి, కె.దినేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జునరెడ్డి, నరసింహులురెడ్డి పాల్గొన్నారు. ప్రసన్న పుట్టినరోజు సందర్భంగా రమణయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

# జిల్లాకు మరో ఇద్దరు డిఎస్పీలు

రాష్ట్రంలో పలువురు సిఐలకు డిఎస్పీలుగా పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు ఇస్తూ డిజిపి గౌతం సవాంగ్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీంతో మన జిల్లాకు ఇద్దరు డిఎస్పీలను కేటాయించారు. శ్రీకాకుళంలో ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం. వీరకుమార్‌ను నెల్లూరులోని ఎస్సీఎస్టీ సెల్ డిఎస్పీగా, విజయవాడ సిటీ సిసిఎస్ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న శివాజీరావును నెల్లూరు సిసిఎస్ డిఎస్పీగా నియమించారు.

# తెలుగు సిఎంల ఢిల్లీ బాట

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రులను జైలుకి పంపిస్తామని చేస్తున్న ప్రచారం ముమ్మరమవుతున్న తరుణంలో ఇద్దరి ముఖ్యమంత్రుల ఢిల్లీ యాత్ర ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

దుబ్బాక ఉప ఎన్నిక విజయంతో పాటు హైదరాబాదు మేయర్ ఎన్నికలలో 48 సీట్లలో గెలుపు, అక్కడ బీజేపీ నేతలతో పాటు ఆంధ్రా భాజపా శ్రేణుల్లో కూడా ఆశలు చిగురించాయని చెప్తున్నారు మేధావులు. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో తమ సత్తా చాటాలన్న తపనతో ఇప్పటినుండే కమల దళం అవలంబిస్తున్న వ్యూహం తెలిసిందే. గెలుపు సాధించేంత స్థాయిలో ప్రభావం చూపలేకపోయినా కనీసం రెండవ స్థానం అయినా సాధించాలన్నది వారి తపన.

రాష్ట్రాల రాజకీయాలు పక్కన పెడితే ఇప్పుడు ఇద్దరు ముఖ్యమంత్రులూ ఒకరి వెనుక ఒకరు వెనువెంటనే ఢిల్లీ బాట పట్టడం చాలామందికి అర్థం కావడం లేదు. అభివృద్ధే అజెండాగా ఢిల్లీ పెద్దలను తమ నాయకులు కలిశారని ఆయా పార్టీల నేతలు చెప్తున్నా తెరవెనుక మర్మం మాత్రం వేరే ఉందని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

ముఖ్యంగా మొన్నటి ఎన్నికలలో ప్రధానమంత్రిపైన బాహాటంగానే ఘాటైన విమర్శలు సంధించిన తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఢిల్లీలో ప్రధానమంత్రితో పాటు హోం మంత్రిని కలిసిన తీరు వారికి వంగి వంగి సలాములు కొట్టిన విధానం చాలా అనుమానాలకు తావిస్తోంది. 11వతేదీ శుక్రవారం సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో కేసిఆర్ 40నిముషాల పాటు ఏకాంతంగా భేటీ అయ్యాడు. వారిద్దరి సమావేశ వివరాలను గోప్యంగా ఉంచారు, అంతకముందు కేంద్ర జలశక్తి శాఖా మాత్యుడు గజేంద్ర షెకావత్‌ను కలిశాడు. ఆ వివరాలను మాత్రం బయటకు వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులకు సంబంధించి చర్చించినట్లు వివరించారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కూడా కలిసిన కేసిఆర్ అక్కడ కూడా 40 నిముషాలకుపైనే గడిపాడు. ఇక్కడ తెలంగాణ అభివృద్ధి అంశాలకు సంబంధించి కేంద్రం సహకారం అందించాలని ప్రధానమంత్రిని కోరడంతోపాటు ఎక్కువ సమయాన్ని రాజకీయ చర్చల కోసమే కేసిఆర్ వినియోగించుకున్నాడని ఆ పార్టీ వర్గాలే బయటకు చెప్తున్నాయి.

### జగన్ టూర్...

15వతేది మంగళవారం ఢిల్లీకి చేరుకున్న ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సమావేశమై దాదాపు గంటకుపైగానే చర్చలు జరిపాడు. పోలవరం అంశమే ప్రధానంగా తమ చర్చ జరిగిందని చెప్తూ, 3 రాజధానుల అంశంలో కేంద్రం మద్దతు కోరామని అధికారికంగా తెలిపారు. ఈ సమావేశంలో సిఎంతో పాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కూడా పాల్గొన్నాడు. అయితే బుధవారం జగన్ ప్రధానమంత్రిని కలుస్తాడని వార్తలు వచ్చినప్పటికీ ఆయన మాత్రం జలశక్తి మంత్రిని కలిసి రాష్ట్రానికి తిరిగి వచ్చేశాడు. హోంమంత్రి అమిత్‌షాతో జరిగిన చర్చలలో కూడా అనేక రాజకీయ అంశాలు, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ప్రస్తావనకు వచ్చాయని ఢిల్లీ వేగుల సమాచారం.

మొత్తం మీద 4 రోజుల వ్యవధిలో ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఢిల్లీ బాట పట్టడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమయ్యింది, అధికార పార్టీలపై రెండు రాష్ట్రాల్లోనూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో ఈ టూర్ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయా రాష్ట్రాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రులు ఢిల్లీ పెద్దలను కలవడం మామూలే కానీ, ఇటీవల తెలంగాణలో జరిగిన ఎన్నికలలో తమ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది — వెంటనే కేసిఆర్ వెళ్లడం, త్వరలో తిరుపతి ఉపఎన్నిక, మరోవైపు స్థానిక ఎన్నికలపై ఎన్నికల కమిషనర్‌తో వివాదం వంటి కీలక సమయంలో జగన్ భేటీ కావడంతో ఈ ఇద్దరి ఢిల్లీ యాత్ర ఈసారి సంచలనంగా మారింది.

# తమిళనాట... తలైవా మాట!

(మొదటి పేజీ తరువాయి)

అయితే మిగతా ముగ్గురికీ రజనికి ఒక వ్యత్యాసముంది. వాళ్ళు అందరూ దక్షిణ భారతదేశానికి చెందినవారే, కానీ శివాజీరావు గైక్వాడ్ దక్షిణాన పుట్టిన ఉత్తరాదీయుడు. 70యేళ్ళ ఈ హీరో 48 సంవత్సరాలుగా తమిళనాడులో ఉంటున్నాడు, తమిళ సినీ రంగంలో అగ్రతారగా ఈనాటికీ వెలిగిపోతున్నాడు. ఎంతమంది కొత్త హీరోలు వచ్చినా ఇప్పటికీ రజనీకాంత్‌కి వున్న ఆదరణ వాళ్ళెవరికీ లేదు. అంతటి స్థాయిలో ఆయన తమిళుల ఆదరణ అభిమానం సంపాదించుకున్నాడు.

నిజానికి తమిళ రాజకీయాలలో రజని ప్రవేశం కోసం పాతికేళ్ళుగా ఆయన అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఆయన రాజకీయాలలోకి రాకపోయినా ప్రజాసేవలో ఉన్నాడు. తన అభిమానులకే కాకుండా తమిళనాట ఎక్కడ ఎలాంటి విధి వైపరీత్యాలు సంభవించినా నేనున్నానంటూ ముందుగా స్పందించేది రజనీయే. ఇప్పుడు తమిళనాట ఎక్కడ చూసినా రజని మాటే వినిపిస్తోంది. రజనీకాంత్ కంటే ముందే పార్టీ పెట్టి రాజకీయ రంగప్రవేశం చేసిన కమలహాసన్ కూడా రజనితో కలిసి ముందుకు వెళ్ళడానికి సుముఖత చూపిస్తున్నాడు. జయలలిత మరణంతో అనిశ్చితితో వున్న తమిళ రాజకీయ రంగంలో ఇప్పుడు అలజడి మొదలయ్యింది. రజనీకాంత్ స్థాపించబోతున్న కొత్త పార్టీ చాలా మంది తటస్తులకు వేదిక కాబోతోంది. తలైవా రాకతో తమిళ రాజకీయాలలో కాక మొదలయ్యింది. ఆయన పార్టీ గుర్తు ఆటో అని వార్తలొస్తున్నాయి. ఉదయసూర్యుడిని, రెండాకులని దాటుకుని తమిళ రాజకీయాలలో ఈ ఆటోవాలా ఏ స్థాయిలో దూసుకుపోగలడో మరో నాలుగు నెలల్లో తేలిపోతుంది.

# పొగాకు రైతులను ఆదుకుంటాం

### - బోర్డు ఛైర్మెన్ రఘునాథబాబు

జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పొగాకు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని పొగాకు బోర్డు ఛైర్మెన్ యడ్లపల్లి రఘునాథబాబు చెప్పారు. ఇటీవల ఆయన కలిగిరి మండలంలో పర్యటించి భారీవర్షాలతో నష్టపోయిన పొగాకు పంటలను, బ్యారెన్లను పరిశీలించారు. నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన బ్యారెన్లకు ఇన్సురెన్స్ కంపెనీల ద్వారా పరిహారం అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బోర్డు వైస్ ఛైర్మెన్ శివారెడ్డి, ఆర్ఎం డి.వేణుగోపాల్, వేలం నిర్వహణాధికారి చంద్రశేఖర్, మాజీ ఎఫ్‌సిఐ డైరెక్టర్ వేళ్ళ సురేంద్రబాబు, స్థానిక రైతు నాయకుడు శ్రీకాంత్‌బాబు తదితరులున్నారు. అనంతరం బోర్డు ఛైర్మెన్ మర్రిపాడు మండలానికి వెళ్ళి డిసిపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించారు. వేలం కేంద్రం పరిధిలో ఉన్న పొగాకు పంటలను కూడా పరిశీలించి రైతులకు తగు సూచనలిచ్చారు.

# నేర్చుకోవాలి

ఓర్చుకోవాలి
బాధల్ని, బాధల గాథల్ని
పంటి బిగువన అదిమిపెట్టి
జీవితాన్ని విలక్షణంగా
సాగుచేయడం నేర్చుకోవాలి
మృతప్రాయమైన స్థితి నుంచి
చలన గమ్యానికి చేరడానికి
నిరంతరాయంగా జీవిత పాఠం
నెమరువేసుకోవాలి
మట్టిలో పుట్టి మట్టి పొరల్లోకి
ప్రవహించి, మట్టిలో పొర్లాడి
మమేకమైన మహామహుల
జీవిత చరిత్రల నుంచి
కొత్తగా నేర్చుకోవాలి
భవిష్యత్ సూర్యుడు పొడిచే దాకా
చీకటిలో మగ్గినా చిటికెడంత
నేర్చుకోవాలి
భయం నివురు వొలచేదాకా
గుండె నెర్రులిచ్చినా ఓర్చుకోవాలి
ఓ నిప్పురవ్వ మహాజ్వాలగా
ఎగిసేదాకా ఓపిగ్గా వేచిఉండాలి
నేర్చుకోవడానికి
కేవలం మన అనుభవాల
విస్తృతి సరిపోదు
ఇతరుల అనుభవాల
ఊడల మాటున
దాగి నేర్పుతో నేర్చుకోవాలి
అప్పటివరకు సంయమనమనే
ఆయుధాన్ని ధరించాలి
అప్పుడే జీవితం చరితార్థమవుతుంది
మనం నడిచే దారిలో ముళ్ళ వీడి
జాజులు పూస్తాయి
ఉషోదయ గీతికలు
స్వాగతిస్తాయి.



- చిన్ని నారాయణరావు
94402 02942

# ఓజిలిలో ఏకలవ్య గురుకుల పాఠశాల

సూళ్ళూరుపేట నియోజకవర్గానికి తొలిసారిగా అయిదుగురు మంత్రులు వచ్చారు. ఈనెల 16న పలు అభివృద్ధిపనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో పాటు మంత్రులు బాలినేని శ్రీనివాసులురెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓజిలి మండలంలోని వాకాటివారి కండ్రిగ గ్రామం వద్ద 12కోట్ల రూపాయలతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల భవన సముదాయానికి మంత్రులు ప్రారంభోత్సవం చేశారు. ఓజిలిలో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నాయుడుపేట, సూళ్ళూరుపేట మునిసిపాలిటీల పరిధిలో కొత్తగా నిర్మించనున్న సామాజిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు మంత్రులు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాలకు ఓజిలి మండలం నుంచి పెద్దసంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

# జిల్లాలో మహిళా ఓటర్లే ఎక్కువ

జిల్లాలో పురుషులకంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. జిల్లా మొత్తం 24,35,035 మంది ఓటర్లుండగా అందులో పురుషులు 11,92,916 మంది కాగా, మహిళలు 12,46,119 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 49,023 మంది అధికంగా ఉండడం విశేషం. జిల్లాలోని మొత్తం 10 నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల వివరాలిలా ఉన్నాయి. కావలి నియోజకవర్గంలో మొత్తం 2,60,051 మంది ఓటర్లుండగా అందులో 1,27,053 మంది పురుష ఓటర్లు కాగా మహిళా ఓటర్లు 1,32,998 మంది ఉన్నారు. అదే విధంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 2,12,747 మంది ఓటర్లుండగా పురుషులు 1,05,517 మంది, మహిళా ఓటర్లు 1,07,230 మంది ఉన్నారు. కోవూరు నియోజకవర్గంలో 2,66,286 మంది ఓటర్లుండగా పురుషులు 1,28,143 మంది, మహిళా ఓటర్లు 1,38,143 మంది ఉన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో 2,40,815 మంది ఓటర్లుండగా పురుషులు 1,17,646 మంది, మహిళా ఓటర్లు 1,23,169 మంది ఉన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 2,62,780 మంది ఓటర్లుండగా పురుషులు 1,28,022 మంది, మహిళా ఓటర్లు 1,34,758 మంది ఉన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 2,33,515 మంది ఓటర్లుండగా పురుషులు 1,14,188 మంది, మహిళా ఓటర్లు 1,19,327 మంది ఉన్నారు. గూడూరు నియోజకవర్గంలో 2,43,452 మంది ఓటర్లుండగా పురుషులు 1,18,770 మంది మహిళా ఓటర్లు 1,24,682 మంది ఉన్నారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో 2,37,162 మంది ఓటర్లుండగా పురుషులు 1,16,290 మంది మహిళా ఓటర్లు 1,20,872 మంది ఉన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో 2,43,119 మంది ఓటర్లుండగా పురుషులు 1,19,756 మంది, మహిళా ఓటర్లు 1,23,363 మంది ఉన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 2,35,108 మందికి గాను పురుషులు 1,17,531 మంది ఉండగా మహిళా ఓటర్లు 1,17,577 మంది ఉన్నారు. కొత్తగా నమోదయ్యే ఓటర్లతో కలిపి తుది ఓటర్ల జాబితాను జనవరి 15న అధికారులు ప్రకటించనున్నారు.

## గీతకార్మికులకు గుర్తింపు కార్డులు

జిల్లాలోని గీతకార్మికులకు గుర్తింపు కార్డులు, మెంబర్‌షిప్ కార్డులు అందించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 16న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. క్షేత్రస్థాయికి వెళ్ళి గీత కార్మికులకు కేటాయించిన సొసైటీల పనితీరును పరిశీలించాలన్నారు. జిల్లాలోని 18 సొసైటీలకు ఈతచెట్లు, తాటిచెట్లు పెంచుకునేందుకు 16.64 లక్షల రూపాయలను మంజూరుచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఎక్సైజ్ డిఎస్‌పి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు పెంచండి.. మంచి గాలిని పీల్చండి

మొక్కలు పెంచడం ద్వారా వాయుకాలుష్యం నివారించాలని, మంచి గాలి పీల్చడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని విఎస్‌యు వీసీ సుదర్శనరావు అన్నారు. వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విఎస్‌యులోని బాలిక వసతిగృహం పరిసరాల్లో ఆయన ఈనెల 16న అరటి, బొప్పాయి తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రెక్టార్ ఎం.చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయర్, సిఎస్ సాయిప్రసాద్‌రెడ్డి, విజయానందబాబు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, వార్డెన్ డాక్టర్ ఆర్ మధుమతి, విఆర్‌టి నీలమణికంఠ పాల్గొన్నారు.

## తగ్గిన కరోనా టెస్ట్‌ల ధరలు

దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో మాత్రమే కోవిడ్ వైరస్ నిర్ధారణ పరీక్షలకయ్యే చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం బాగా తగ్గించింది. ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కోవిడ్ బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం నుంచి ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్తే పరీక్షల నమూనాకు గతంలో 800 రూపాయల దాకా చెల్లించేవారు. ఇప్పుడు దాని ధరను 475 రూపాయలకు తగ్గించారు. అదేవిధంగా నేరుగా ప్రైవేట్ ల్యాబ్‌కు వెళ్ళి పరీక్షలు చేయించుకునేవారు గతంలో వెయ్యి రూపాయలు చెల్లించేవారు. ఇప్పుడు దానిని 499 రూపాయలకు తగ్గించినట్లు ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈనెల 16న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ నుంచి ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. ఎన్ఏబిఎల్, ఐసిఎంఆర్ అనుమతులున్న లేబొరేటరీలు సవరించిన రేట్లప్రకారమే వసూలు చేయాలే తప్ప అంతకుమించి ఎక్కువగా వసూలుచేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

# విద్యార్థులతో పుస్తకాలను బాగా చదివించాలి

జిల్లాలో విద్యార్థులకు పుస్తకపఠనం పట్ల ఆసక్తి కలిగించాలని, వారితో పుస్తకాలను బాగా చదివించాలని అమరావతి సమగ్ర శిక్షా డైరెక్టర్ పి.పార్వతి అన్నారు. ఈనెల 16న ఆమె నెల్లూరు, వనంతోపు సెంటర్‌లోని ఇన్నాంట్ జీసస్ ఉన్నతపాఠశాలలో సహిత ఉపాధ్యాయులకు జరుగుతున్న 5 రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పట్ల అందరూ సేవాభావంతో ఉంటూ సహ విద్యార్థులతో సమానంగా వారిని ఆదరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కో-ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లురెడ్డి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

వీక్షణం

- మంజీర

# 'సాగు'తున్న ఉద్యమం



చట్టం తన పని తాను చేసుకుపోతుంది. మరి ఆ చట్టాలు చేయాల్సిన చట్టసభలు? అవి కూడా మౌనంగానో, గందరగోళాలు, అరుపులు కేకల మధ్యనో ఎలాగోలా 'చట్టాలు చేయడం' అనే తన పనిని చేసుకుపోతుంటాయి. చట్టాలు చేయాల్సిన ప్రతినిధులు... చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వాలు... ఏం చేస్తున్నాయి? ప్రజల కోసం రూపొందించే చట్టాలను సామాన్యులకు అర్థం కాని బ్రహ్మపదార్థంగా మారుస్తున్నాయి. అలాంటి తాజా బ్రహ్మపదార్థాలు '2020 కేంద్ర వ్యవసాయ చట్టాలు'. బిల్లును సభలో ప్రవేశ పెట్టడం, వివరించడం, లోక్‌సభలో ఆమోదం పొందడం అన్నీ ముందుగా తయారుచేసుకున్న స్క్రిప్టు ప్రకారం జరిగిపోయాయి. రాజ్యసభలో వ్యతిరేకతలను దాటుకుని రాష్ట్రపతి భవనం తలుపు తట్టడం, అక్కడ రాజముద్ర వేసుకోవడం కూడా జరిగిపోయింది. అంతా రాజ్యాంగబద్ధంగానే జరిగింది. కానీ... ఆ చట్టం ఎవరికోసమైతే చేశామని ప్రభుత్వం చెప్పుకుంటుందో ఆ రైతులే 'ఈ చట్టం మాకొద్దు' అని ఆందోళనలకు దిగారు. వారికి మద్దతుగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఇవి రైతు సంక్షేమ చట్టాలు కాదు, వ్యాపారి సంక్షేమ చట్టాలు మాత్రమే అని మేధావులు ఆరోపిస్తున్నారు.

## నాటి సినిమా నేటి నిజం!

ఢిల్లీ సరిహద్దులో సింఘు గ్రామంలో వేలాదిగా రైతులు రోడ్డు మీద బైఠాయించారు. ఈ కొత్త చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనేది వారి డిమాండ్. 'వెనక్కి తీసుకుంటాం' అని చెప్పగలిగిన పరిస్థితిలో లేదు మోదీ ప్రభుత్వం, అలాగని 'వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదు' అని కూడా కచ్చితంగా ప్రకటించదు. 'రైతుల సంక్షేమం కోసమే ఈ చట్టాలు' అంటున్న ప్రభుత్వపెద్దలు ఆ 'మంచి' ఏంటో చెప్పలేకపోతున్నారు. చట్టంలో 'కనీస మద్దతు ధర ప్రస్తావన ఏది' అని అడిగితే అది రాష్ట్ర ప్రభుత్వాలు చూసుకుంటాయని తప్పుకుంటున్నారు. 'రైతు తనకు తోచిన ధరకు అమ్ముకోవచ్చు... ఇందులో ప్రభుత్వ నియంత్రణ ఉండదు' అని లౌక్యం నిండిన సమాధానం కూడా వచ్చింది. ఓ ఇరవై ఏళ్ల కిందట స్వర్గీయ నందమూరి హరికృష్ణ ఇదే ఇతివృత్తం మీద 'టైగర్ హరిశ్చంద్రప్రసాద్' సినిమా తీశారు. ఆ సినిమాలో పంటకు గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేస్తున్న రైతుల దగ్గరకు మంత్రి వస్తాడు. రైతులు మంత్రిని సాదరంగా ఆహ్వానించి కూర్చోబెట్టి కొబ్బరిబోండాం ఇస్తారు. మంత్రి కొబ్బరి నీరు తాగబోతుండగా ఒక రైతు లేచి 'దీని ధర ఎంతో తెలుసా' అని అడుగుతాడు. మంత్రి 'తెలియదు' అంటారు. మంత్రి ధరించిన చెప్పులు, దుస్తులు, కళ్లద్దాలు, జేబులో పెన్ను, ఆయన వచ్చిన కారు ధరలు అడుగుతారు. వాటన్నింటికీ కచ్చితమైన సమాధానాలిస్తాడు మంత్రి. అవన్నీ తయారీదారులు నిర్ణయించిన ధరలు. ముడిసరుకు, ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులన్నీ లెక్కచూసుకుని తయారీదారులు తమ శ్రమను కూడా లెక్కించి నిర్ణయించిన గిట్టుబాటు ధరలు. అందుకే వాటి ధర స్పష్టంగా ఉంది. కొబ్బరి బోండాం దగ్గరకు వచ్చేటప్పటికి దాని ధరను నిర్ణయించేది పండించిన రైతు కాదు. టోకుగా కొనుగోలు చేసే వ్యాపారి. ఇక్కడ కొనే వ్యక్తి ధరను నిర్ణయిస్తాడు. అదే కాయను అమ్మేటప్పుడు మాత్రం కాయ ధరను నిర్ణయించేది ఆ కాయను కొనే వినియోగదారుడు కాదు, కాయలను అమ్మే చిరు వ్యాపారి. రైతుకి వినియోగదారుడికి మధ్య వారధిలా ఉండే వ్యాపారి పంటను కొనేటప్పుడు తానే ధరను నిర్ణయిస్తున్నాడు. అమ్మేటప్పుడూ తానే నిర్ణయిస్తున్నాడు. కొబ్బరి బోండాన్ని పండించిన రైతు కన్నీళ్లు తాగుతుంటాడు, బోండాన్ని కొని తాగే వినియోగదారుడు కన్నీళ్లు పెట్టుకుంటూ కొబ్బరి నీళ్లు తాగుతుంటాడు. నిన్న అయినా నేడు అయినా రైతు కష్టాలు ఇలాగే ఉన్నాయి. రైతు రేపు కూడా ఇలాంటి కష్టాన్ని ఎదుర్కోకూడదు... అంటే కొత్త వ్యవసాయ చట్టాలు ఆ కష్టాలను తీర్చగలుగుతాయా? తీర్చలేకపోతే ఇక ఆ చట్టాలు ఎందుకు?

## కరవు కష్టాలు... వరద నష్టాలు

'కాంట్రాక్టు వ్యవసాయం' అనేది రైతుకి ప్రభుత్వం కల్పిస్తున్న గొప్పవరం అన్నట్లు చిత్రీకరిస్తోంది ప్రభుత్వం. అయితే ఈ కాంట్రాక్టు ప్రకారం వ్యాపారి విధించే షరతుల గురించి మాత్రం మాట్లాడదు. షరతులేవీ ఉండవని కూడా స్పష్టం చేయడం లేదు. కాంట్రాక్టు పద్ధతిలో రైతుకి పంట పెట్టుబడికి పెద్ద పెద్ద కంపెనీలు ఆర్థిక సహాయం చేస్తాయని చెప్తోంది ప్రభుత్వం. ఆ పంటను సదరు కంపెనీ కొంటుందని కూడా హామీ ఇస్తోంది. అక్షరాల్లో అంతా బాగా ఉంది. వాచకంలోనూ వినసొంపుగానే ఉంది. మరి... పంట వేసిన తర్వాత కరవు వస్తే ఏం చేయాలి? పంట పండించిన తరవాత వరద వస్తే అప్పుడేం చేయాలి? రైతులు పంట కోసం కంపెనీల నుంచి ఆర్థిక సహాయం రూపంలో తీసుకున్న అప్పు చెల్లించగలిగిన పరిస్థితిలో ఉండరు. ప్రభుత్వం పంటల బీమా కల్పించి ఆ అప్పు నుంచి రైతుకి విముక్తి కల్పిస్తుందా? ఏమో ఇలాంటి ప్రస్తావన ఏదీ ఆ మూడు చట్టాల్లో కనిపించడం లేదు. చట్టాల్లో లేదు సరి కదా! ఇరవై రోజులకు పైగా ఆందోళన చేస్తున్న రైతులు కూడా 'చట్టాన్ని వెనక్కి తీసుకుంటారా లేదా' అని హూంకరిస్తున్నారు తప్ప... ఆచరణలో ఎదురయ్యే కష్టాలను లేవనెత్తడం లేదు. రైతులకు మద్దతుగా నిలుస్తున్న మేధావులూ అడగడం లేదు.

## రైతు లేని రైతు చట్టాలు

ఇవన్నీ చూస్తుంటే... చట్టాలకు రూపకల్పన చేసేటప్పుడు ప్రభుత్వం రైతు ప్రతినిధుల సూచనలను తీసుకోలేదు. ఉద్యమిస్తున్న రైతులు కూడా తమ సొంత మెదళ్లతో ఆలోచిస్తున్నట్లు కనిపించడం లేదు. అధికార పార్టీ నాయకులు కూడా అరౌండ్ ద బుష్ అన్నట్లు... విషయం లోతుల్లోకి వెళ్లకుండా చుట్టూ పరిభ్రమిస్తున్నారు తప్ప చట్టాన్ని విశ్లేషించడం లేదు. ఆచరణలో ఎదురయ్యే ఇబ్బందులకు పరిష్కారం ఇదని చెప్పడం లేదు. 'ఉద్యమిస్తున్న రైతులు పిజ్జాలు తిన్నారు, ఖలిస్తాన్ అనుకూల నినాదాలు చేశారు, ఇందిరాగాంధీ ఉదంతాన్ని గుర్తు తెచ్చి మోదీని బెదిరిస్తున్నార'ంటూ ఈ ఉద్యమాన్ని మోదీ కేంద్రకంగా మలుస్తున్నారు. రైతు ఉద్యమకారుల మద్దతుదారులు కూడా విషయాన్ని మోదీ కేంద్రకంగానే చూస్తున్నారు. ఈ ఉద్యమం క్రమంగా పీటముడిగా మారడానికి కారణం ఈ మొత్తం ఉద్యమచిత్రంలో నిజమైన రైతు శ్రేయోభిలాషులు లేకపోవడమే.

# ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి!

## • కిలివేటి సంజీవయ్యను అభినందిస్తున్న ప్రజలు



**సాధారణంగా ఎవరికైనా ఆపద సంభవించినప్పుడు వారిని ఆదుకోవడానికి కృషి చేసే నాయకులు ఈ కాలంలో కాస్తంత అరుదే. కానీ సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అలా కాదు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తన విద్యుక్త ధర్మమంటూ అన్నివేళలా ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటుంటాడు. ఒక బాలిక నదిలో గల్లంతైన విషయం తెలిసి ఆయన సహాయక బృందాలతో కలసి నదిలో పడవలోవెళ్ళి స్వయంగా గాలింపుచర్యలు చేపట్టడంతో స్థానిక ప్రజలు ఆయన సాహసానికి ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలంటూ కిలివేటిని అభినందించారు.**

అభం శుభం తెలియని ఓ బాలిక హటాత్తుగా రోడ్డుప్రమాదానికి గురై స్వర్ణముఖి నదిలో గల్లంతైపోయింది. ఆ బాలికతో పాటు బైక్‌లో వస్తున్న తల్లిదండ్రులు కూడా నదిలో పడిపోయినా వారెలాగో బయటపడ్డారు కానీ వారి కుమార్తె మాత్రం ప్రవాహంలో కొట్టుకుపోయింది. కళ్ళెదుటే కూతురు నదిలో కొట్టుకుపో తుంటే ఆ తల్లిదండ్రుల బాధ ఎంత హృదయవిదారకంగా ఉంటుందో చూడండి!.. ఈ దశలో ఎవరికీ ఏమీ చేయడానికి పాలుపోలేదు. ఒకవైపు చీకటి, మరోవైపు వేగంగా పారుతున్న నది. ఈ స్థితిలో బాలిక గల్లంతైన విషయం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు తెలిసింది. అంతే ఆయనింక ఒక్కక్షణం కూడా ఆగలేదు. ఆగమేఘాల మీద అధికారులను అప్ర మత్తం చేశారు. నది వద్దకు అందరూ పరుగులు తీశారు. రెస్క్యూ టీమ్‌తో పాటు తనూ పడవలో దిగి గల్లంతైన ఆ పాప కోసం నదిలో గాలించారు. ఎమ్మెల్యే చొరవకు, సాహసానికి అక్కడి ప్రజలంతా నివ్వెరపోయారు. ప్రజలు ఆపదలో ఉన్న ప్పుడు ఆదుకోవడం తమ ధర్మమంటూ ఆయన స్వయంగా ఆ పాప కోసం గాలించడమే కాక, పాప ఆచూకీ తెలిసేవరకు అధికారులను పురమాయిస్తూనే ఉండడం ఎంతైనా విశేషం.

### అందరినీ కలిచివేసిన రోడ్డు ప్రమాదం :

ఈనెల పన్నెండో తేది రాత్రి శనివారం ఆ కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది. కన్నబిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులు గర్భశోకంతో కుమిలిపోయారు. ఆ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తొమ్మిదేళ్ళ తమ కూతురు ప్రవల్లిక నదిలో పడిపోయి గల్లంతు కావడంతో తుమ్మూరుకు చెందిన ఆ తల్లిదండ్రుల పడిన వేదన రోదన అంతా ఇంతా కాదు. వారి బాధను చూసి కంటతడిపెట్టని వారు లేరు. నాయుడుపేటలోని స్వర్ణముఖి కాజ్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదం జిల్లా ప్రజలందరినీ కలచివేసింది. రెండు మోటార్‌బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలుకావడమే కాక తల్లిదండ్రులతో కలసి బైక్‌పై వస్తున్న తుమ్మూరుకు చెందిన ప్రవల్లిక అనే బాలిక స్వర్ణముఖి నదిలో పడి గల్లంతైంది. ఆ బాలిక ఆచూకీ తెలుసుకునేందుకు అధికార యంత్రాంగమంతా కదిలింది. సూళ్లూరు పేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో పాటు ఆర్డీఓ సరోజిని, గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఎస్ఐ డి.వెంకటేశ్వర రావు, అగ్నిమాపకశాఖ అధికారి వై.సుధాకర్, పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ళు, రెస్క్యూటీమ్ అందరూ కలసి ఫ్లడ్‌లైట్ల సాయంతో నదిలో పడిపోయిన బాలిక కోసం రాత్రంతా గాలించారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో మరుసటిరోజు కూడా పగలు రాత్రీ అందరూకలసి వెతికారు. స్వర్ణముఖి నది పక్కలనున్న మేన కూరు, తుమ్మూరు, తుమ్మ్యాజికండ్రిగ, బేరిపేట, పడమటవీధి తదితర ప్రాంతాలకు చెందిన యువకులు కూడా వచ్చి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడురోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. ఎట్టకేలకు ఈనెల 15 మంగళవారం తుమ్మూరు వద్ద నదిలో బాలిక మృతదేహం కనిపించడంతో బాలిక తల్లిదండ్రులు గుండెలవిసిపోయేలా రోదించారు. నదిలో ప్రవాహ వేగానికి ఇసుక ఊబిలో కూరుకుపోయి గుర్తుపట్ట లేకుండా ఉన్న ఆ బాలిక మృతదేహాన్ని యువత గుర్తించి ఒడ్డుకు చేర్చారు. స్వర్ణముఖి కాజ్‌వేపై వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడపాలని ఈ సందర్భంగా పోలీసులు అందరికీ సూచించారు.

## కళ్యాణ వైభవం...!

**రాజేష్‌కుమార్‌రెడ్డి - ఆశ్రిత**



**సీనియర్ న్యాయవాది, నెల్లూరుజిల్లా గూడూరు డివిజన్‌లోని కోట బార్ అసోసియేషన్ మరియు కోట రోటరీక్లబ్‌ల అధ్యక్షుడు పెల్లేటి గోపాలరెడ్డి-ప్రమీలాదేవిల కనిష్ట కుమారుడు (పెల్లేటి రామిరెడ్డి - రాజమ్మల మనుమడు) హైకోర్టు న్యాయవాది రాజేష్‌కుమార్ - ఆశ్రిత (ముత్తుకూరు మండలం, దామాయపాళెం వాస్తవ్యులు పడాల బాలసుబ్రహ్మణ్యం రెడ్డి , శరణ్యల కనిష్ట పుత్రిక) వివాహం డిసెంబర్ 10 వతేది నెల్లూరులో జరిగింది. నూతన వధూవరులకు లాయర్ శుభ దీవెనలు.**


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: lawyerpatrika@gmail.com